పాఠ్యపుస్తకాలఅమ్మకాలు చేపడుతున్న వారిపై

## చర్యలు తీసుకోవాలి

బోధన్ విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్.

16 పేజీలో...

ESTD : 1999

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్

STATE VISION

శనివారం 26-06-2026 పేజీలు : 16

## నివాస ప్రాంతంలో డంపింగ్ యార్డు తొలగించాలి



-నిజాంపేట్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

-మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన

-దుర్వాసన, దోమలతో స్థానికులు అనారోగ్య భయాందోళనలో జీవనం

-రోడ్లపై చెత్తతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం

-చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని సీపీఎం హెచ్చరిక

7 పేజీలో...

# మూసి మొదటి దశ ప్రాజెక్ట్ పైన చర్చ

### ఎంసీఆర్ హెచ్ ఆర్ డి బోధి పెవిలియన్‌లో మూసీ రివర్ ఫ్రంట్ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జూన్ 26 (విజన్ ఆంధ్ర) : ఎంసీఆర్ హెచ్ ఆర్ డి బోధి పెవిలియన్ లో మూసీ రివర్ ఫ్రంట్ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ఎంపీ వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఎండీ నర్సింహారెడ్డి, ఎంఆర్డీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్,మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు

మూసి మొదటి దశ ప్రాజెక్ట్ పైన చర్చించారు. ముసి రివర్ బెడ్ లో ఉన్న వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి..

భూ సేకరణ కోసం ఆసక్తి ఉన్న వాళ్లకు టీడీఆర్ ఇవ్వాలి లేదా పరిహారం చెల్లించాలని, గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం తీసుకుంటున్న డిఫెన్స్ భూముల్లో ఉన్న నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వమే తరలించాలని అన్నారు.



ప్రజల సందర్శన కోసం మూసీ ఎక్స్పీరియన్స్ సెంటర్ ను నక్లెస్ రోడ్ లో ఏర్పాటు చేయాలన్నారు.

మూసీ ప్రాజెక్ట్ లో చేపట్టబోయే పనులు సెంటర్ లో ప్రతిబింబించాలని, ఇక్కడ ప్రాజెక్ట్ పైన ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని పేర్కొన్నారు.

## బఫర్ జోన్ల కబ్జా...

వాగుల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు

స్థానిక లీడర్ల జోక్యంతో పట్టించుకోని మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్లు



11 పేజీలో...

# సమగ్ర అభివృద్ధే లక్ష్యం..

- అర్హులందరికీ సంక్షేమం

-99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై జిల్లా స్థాయి సమీక్ష

-వార్డు సభలతో ప్రజా సమస్యల గుర్తింపు.. పరిష్కారానికి కార్యాచరణ

-విద్య, వైద్యం, వ్యవసాయం, గృహాలు, సంక్షేమంలో విశేష పురోగతి

-వర్షాకాల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి.. మున్సిపల్ యంత్రాంగానికి ఆదేశాలు



-ప్రతి శాఖ సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు వికాస్ రాజ్ సూచన

5 పేజీలో...

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**: ఏసీపీ కిరణ్ కుమార్**

**మత్తు వ్యసనాలపై అవగాహనకు 2కే రన్**



బెల్లంపల్లి, జూన్ 26 విజన్ ఆంధ్ర : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని బెల్లంపల్లి ఏసీపీ వి. కిరణ్ కుమార్ సూచించారు.

మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలో 2కే రన్ నిర్వహించారు. 1 టౌన్ సీఐ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై రన్‌ను ప్రారంభించారు.

తిలక్ స్టేడియం నుంచి కాంటా అంబేద్కర్ చౌరస్తా వరకు సాగిన రన్‌లో విద్యార్థులు, యువత, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు. మత్తు వ్యసనాలు వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలను కూడా దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.

# అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

మధిర,జూన్26(విజన్ఆంధ్ర)అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మధిర పరిధిలోని షేర్ చేయూత డి అడిక్షన్ సెంటర్ లో సి గోపాలరెడ్డి గారి అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మధిర జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి దీప్తి వేముల ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తి ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలు మరియు సమాజ సేవ వైపు దృష్టి సారించాలని సూచించారు.డ్రగ్స్ వినియోగం వల్ల జీవితాలు నాశనమవడంతో పాటు చట్టపరంగా కూడా తీవ్రమైన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు మరియు ప్రభుత్వ శాఖలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు."ఖుఎ చీశ్ శీ ణతీబస్త్రం -- ఖుఎ్‌వర్ శీ



ాఱటవ" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయ విద్యార్థులు మరియు పలువురు ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా మొహరం పండుగ



సూర్యాపేట జూన్ 26:(విజన్ ఆంధ్ర): సూర్యాపేట జిల్లా కేంద్రంలో మొహరం పండుగను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్లను డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి ఈశ్వర్ థియేటర్ సమీపంలో బావిలో నిమజ్జనం చేశారు. కుల మతాలకతీతంగా భక్తిశ్రద్ధలతో పండుగను ప్రశాంతంగా జరుపుకున్నారు.

# నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా మొహరం పండుగ వేడుకలు

అందోల్ జూన్ 26 (విజన్ ఆంధ్ర ప్రతినిధి)అందోల్ నియోజకవర్గం వ్యాప్తంగా అందోల్ జోగిపేట్ పుల్కల్ సంగుపేట్ శివ్వంపేట్ అల్లాదుర్గం వట్ పల్లి తదితర గ్రామాల్లో ఘనంగా మొహరం పండుగ వేడుకలు నిర్వహించుకున్నారు. లౌకికత్వానికి, హిందూ-ముస్లింల మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే చారిత్రాత్మక మొహరం పండుగ వేడుకలు మొహరం ఫెస్టివల్ శుక్రవారం నాడు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి.గ్రామంలోని బి బి ఫాతిమా పీర్ల ప్రతిష్ఠాపనతో నియోజకవర్గం వ్యాప్తంగా ఒక్కసారిగా పండుగ వాతావరణం నెలకొంది.వేడుకల్లో భాగంగా గ్రామానికి చెందిన ప్రముఖ ముస్లిం సోదరులు 'బి బి ఫాతిమా పీర్లను' అత్యంత రమణీయంగా, సాంప్రదాయ పద్ధతిలో రంగురంగుల వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పీర్ల మసీదు చావిడిలో ఏర్పాటు చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు.

**పీర్ల మసీదు వద్ద భక్తుల మొక్కులు -- అసైదుల ఆటలు**

మొహరం సంబరాల ప్రారంభాన్ని పురస్కరించుకుని స్థానిక పీర్ల మసీదు ఆవరణకు మహిళలు, యువకులు, ముస్లిం పెద్దలు మరియు హిందూ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.కులమతాల భేదం లేకుండా అందరూ కలిసి పీర్ల సాక్షిగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు పీర్ల వద్దకు చేరుకుని బి బి ఫాతిమా పీర్ల వద్ద తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లో పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి ఇంటా శాంతి, సౌభాగ్యం విలసిల్లాలని భక్తితో ప్రార్థించారు. సాంప్రదాయబద్ధంగా పీర్లకు 'కుడుకలు' (ఎండు కొబ్బరి) సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.రాత్రి వేళల్లో గ్రామ యువకులు, పెద్దలు కలిసి పీర్ల చావిడి వద్ద డప్పుల నాదాలు, భక్తిగీతాల మధ్య సాంప్రదాయ 'అసైదుల ఆటలు' (మొహరం జానపద నృత్యాలు) ఆడుతూ పండుగ ఉత్సాహాన్ని అంబరాన్నంటించారు.



# జోరుగా మార్కెట్ మందుల విక్రయాలు నిబంధనలు గాలికి, ప్రజల ప్రాణాలతో చెలగాటం

భూపాలపల్లి జిల్లా జూన్ 26 (విజన్ ఆంధ్ర ) జ్వరం వస్తే మెడికల్ షాపుకు వెళ్తే చాలు, డాక్టర్‌తో పనిలేకుండానే వైద్యం దొరికేస్తోంది. భూపాలపల్లి జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లోని పలు మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండానే అన్ని రకాల మందుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. డ్రగ్ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం తో ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది.

షెడ్యూల్-ఎ మందులు సైతం ఓపెన్ సేల్ డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940 ప్రకారం షెడ్యూల్-ఎ, ఎ1, ఎ కేటగిరీ మందులను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మకూడదు. యాంటీబయాటిక్స్, నిద్రమాత్రలు, స్టెరాయిడ్స్ ఈ జాబితాలోకే వస్తాయి. కానీ జిల్లాలోని చాలా షాపుల్లో అడిగిన వెంటనే మందులను చేతికందిస్తున్నారు. తలనొప్పి అని చెప్తే చాలు, పవర్‌ఫుల్ పెయిన్ కిల్లర్ ఇచ్చేస్తున్నారు. జలుబు అంటే యాంటీబయాటిక్ ఇస్తున్నారు. సైడ్ ఎఫెక్ట్స్ గురించి చెప్పేవాడే లేదు" అని జిల్లా కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి వాపోయాడు.

ఫార్మసిస్ట్ లేకుండానే దుకాణం

నిబంధనల ప్రకారం ప్రతి మెడికల్ షాపులో రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ తప్పనిసరిగా ఉండాలి. రోగికి మందు ఇచ్చేటప్పుడు డోసేజ్, వాడే విధానం వివరించాలి. కానీ జిల్లాలో 60% పైగా షాపులు ఫార్మసిస్ట్



లేకుండానే నడుస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. 10వ తరగతి పాస్ కాని వారు సైతం కౌంటర్‌లో కూర్చుని మందులు ఇస్తున్నారు.

గడువు తీరిన మందులు, రెట్టింపు ధరలు

మరికొన్ని చోట్ల గడువు తీరిన టాబ్లెట్లు, సిరప్‌లపై ఉన్న ఎక్స్‌పైరీ డేట్‌ను చెరిపేసి లేదా కొత్త స్టిక్కర్లు వేసి అమ్ముతున్నారు. ఎమ్మార్పీ కంటే 20% నుండి 50% అధికంగా వసూలు చేస్తున్నారు. బిల్లు అడిగితే "బిల్లు కావాలంటే మందులు దొరకదు" అని బెదిరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.కాటారం మండలానికి చెందిన ఓ మహిళ మాట్లాడుతూ, "నా కొడుకుకు దగ్గు అని షాపుకు వెళ్తే 3 రకాల సిరప్‌లు ఇచ్చాడు. 450 అయింది. బిల్లు లేదు. ఇంటికి వచ్చి చూస్తే రెండు సిరప్‌ల డేట్ అయిపోయింది" అని ఆవేదన వ్యక్తం చేసింది.

తనిఖీలేవి? చర్యలేవి?

జిల్లాకు ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉండగా, తనిఖీలు మాత్రం నామమాత్రంగా మారాయి. సీజనల్‌గా ఒకటి రెండు షాపులపై దాడి చేసి, మామూళ్లు మాట్లాడుకుని వదిలేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది.

"ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా తనిఖీ చేయాలి. సాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపాలి. కానీ ఇక్కడ ఆ పరిస్థితి లేదు.

జిల్లా కలెక్టర్, డ్రగ్ కంట్రోల్ అధికారులు వెంటనే స్పందించి జిల్లాలోని అన్ని మెడికల్ షాపులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫార్మసిస్ట్ లేని షాపులు సీజ్ చేయాలని, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మేవారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరుతున్నారు. నకిలీ, గడువు తీరిన మందుల విక్రయాలను అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి ప్రజలు చేస్తున్నారు.డ్రగ్ కంట్రోల్ టోల్ ఫ్రీ: 1800-425-0812 జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, భూపాలపల్లి లేదా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

# రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేయాలి- ఓదెలు యాదవ్



యాదాద్రి జూన్ 26 వలిగొండ (విజన్ ఆంధ్ర) జూలై 5న భువనగిరిలో నిర్వహించనున్న తెలంగాణ రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేయాలని రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్ పిలుపునిచ్చారు శుక్రవారం మండల కేంద్రంలో బిసి ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు. సాయిని యాదగిరి మర్రి వెంకన్న పల్లెర్ల రామచందర్ సంగిశెట్టి క్రిస్టఫర్.ఎస్.కె అజ్జులతోపాటు పలువురుకి ఆహ్వాన పత్రికలు అందజేశారు. అనంతరం రాజీవ్ చౌరస్తా వద్ద హలో బీసి. చలో భువనగిరి మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో. బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ వర్గాలు ఒక్కటైతే రాజ్యాధికారం సాధించడం సాధ్యమవుతుందన్నారు. తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. మండలం నుండి పెద్ద ఎత్తున బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాల ప్రజలు జూలై 5న భువనగిరి సభకు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. రాజ్యాధికారం పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ మాట్లాడుతూ తెలంగాణలోని బడుగు బలహీన వర్గాల దళిత గిరిజన మైనార్టీల సంక్షేమం హక్కుల సాధనే ధ్యేయంగా తీన్మార్ మల్లన్న ఈ పార్టీని స్థాపించారని వెనుకబడిన వర్గాలకు రాజ్యాధికారం దక్కినప్పుడే మన బ్రతుకులు మారుతాయని అన్నారు భువనగిరి సభ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలుకుతుందని, దశాబ్దాలుగా బీసీలు ఎదురుచూస్తున్న రాజ్యాధికార సాధనకు ఈ సభ కీలక వేదిక కానుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షులు బొలుగుల నరసింహ ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బందారపు నరసయ్య గౌడ్ రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్ మండల ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ళ రమేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొలుసుల శ్రీనివాస్ గుగ్గిళ్ళ శేఖర్ కొండ నరేష్ బిక్షపతి గౌడ్ పిట్టల సుశీల వెంకటేష్ యాదవ్ రాజు యాదవ్ శ్రీకాంత్ రవికుమార్ అశోక్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# కోటమైసమ్మ ఆలయంలో వేలంపాట



కారేపల్లి,జూన్ 26(విజన్ ఆంధ్ర) : కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ తల్లి ఆలయంలో ఏడాది కాలపరిమితి తో టెంట్ సామాను కిరాయికి ఇచ్చుకోవడానికి, కొబ్బరి చిప్పల పోగు చేసుకోవడానికి వేలం పాటను ఈనెల 29వ తారీఖున నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ పట్టాభి రామారావు,ఈవో కే.వెంకటయ్య తెలిపారు. జూలై 1వతేది నుండి 31జూన్2027 కాలపరిమితితో కోట మైసమ్మ తల్లి ఆలయ పరిసరాలలో టెంట్ సామానుల నిర్వహణ,కొబ్బరి చిప్పల పోగు చేసుకోవడానికి ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. టెంట్ హౌస్ నిర్వాణ కోసం రూ. లక్ష, కొబ్బరి చిప్పల కోసం రూ.5000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన వచ్చునీ తెలిపారు. కొబ్బరి చిప్పల పోగుకు జాతర సమయంలో 20 రోజులు అవకాశం లేదన్నారు. ఆ సమయంలో వేరే టెండర్ అమలులో ఉంటుందని తెలిపారు.

# శ్రీ వినాయక ఎలక్ట్రిక్ స్కూటీ మోటార్స్ షోరూం ప్రారంభం



యాదాద్రి జూన్ 26 వలిగొండ (విజన్ ఆంధ్ర) మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ పక్కన ప్రోపరేటర్స్ యాట కళ్యాణ్ బాబు మాటూరి శంకర్ ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వినాయక ఎలక్ట్రిక్ స్కూటీ మోటార్స్ సేల్స్ అండ్ సర్వీస్ వాహనాల షో రూమును చౌటుప్పల్ వైస్ ఎంపీపీ భద్రయ్య శుక్రవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరల రేట్లు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఎలక్ట్రిక్ మోటార్ వాహనాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. కాలుష్యం నుంచి బయటపడాలంటే ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ స్కూటీ వాహనాల వైపు దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఎలక్ట్రిక్ వాహనాలు తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోబోతుందన్నారు. దీంతో రానున్న రోజుల్లో ఇంధన ధరలు తగ్గుముఖం పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో పదేళ్లలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు ఈ ప్రాంత ప్రజలు ఎలక్ట్రిక్ స్కూటీ వాహనాలు రూ 40 వేల నుంచి 80 వేల వరకు వివిధ మోడల్లో లభించునని సివిల్ 750 వరకు ఉంటే ఫైనాన్స్ కూడా ఇప్పిస్తామని వాహనాలకు సర్వీస్ అందుబాటులో ఉంటుందని అన్నారు ఈ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి సత్తయ్య కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పాల్గొన్నారు

# కొమ్ముగూడెంలో యువతకు టైలరింగ్‌లో శిక్షణ

## - శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ కల్తి భద్రయ్య



కారేపల్లి,జూన్ 26(విజన్ ఆంధ్ర) : ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో యువతకు ఉపాధి శిక్షణలో భాగంగా యువ శిక్షణ కేంద్రం ఇల్లందు వారిచే సింగరేణి మండలం కొమ్ముగూడెంలో టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కల్తి భద్రయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ శిక్షణ కేంద్రంలో యువతులకు అడ్వాన్స్ కుట్టు పని, బ్లౌజ్ డిజైనింగ్ ఎంబ్రాయిడరీ,డ్రెస్ మేకింగ్ పై శిక్షకులు ట్రైనింగ్ ఇస్తున్నారు. శిక్షణార్థులకు సర్పంచ్ కల్తి భద్రయ్య శిక్షణా మెటీరియల్ ను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శిక్షణ పొందిన యువతులకు సర్టిఫికెట్ల ఇవ్వడంతో పాటు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు చూపటం ఈ శిక్షణ ఉద్దేశమన్నారు.

ఈ కార్యక్రమంలో కారేపల్లి సొసైటీ డైరెక్టర్ దేగల ఉపేందర్,గ్రామపంచాయతీ సెక్రటరీ లోకేశ్వరి, వైటీసీ మేనేజర్ సన్నీ,శిక్షకులు విజయకుమారి, చైతన్య కుమార్,మల్లయ్య,వార్డ్ మెంబర్ పెనక నాగేష్,కరపటి భవాని తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి సీపీఎం వితరణ



కారేపల్లి,జూన్ 26(విజన్ ఆంధ్ర) : కారేపల్లి మండలం ఎర్రబోడు గ్రామానికి చెందిన తగరం వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వీరయ్య కుటుంబం దళిత పేద కుటుంబం కావడంతో వారు జీవనానికి ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎర్రబోడు సీపీఎం గ్రామశాఖ రూ.4700 లను శుక్రవారం కుటుంబానికి అందజేసింది. ఈ సందర్భంగా సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు వజ్జా రామారావు మాట్లాడుతూ సీపీఎం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని,బాధితులకు,నిర్వాసితులకు సిపిఎం కార్యాలయాలు సంరక్షణ శిబిరాలు గా నిలబడుతున్నాయని తెలిపారు. ఎర్రబోడు సీపీఎం గ్రామ శాఖ బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పండగ కొండయ్య,ఎర్రబోడు శాఖ కార్యదర్శి కుర్సం శీను, నాయకులు బోజడ్ల గోవిందరావు,కాటేపల్లి నవీన్ చరప వీరస్వామి,సుంకర నరేష్,కుందనపల్లి పవన్,కనికరపు వెంకటేశ్వర్లు,పండగ పుల్లారావు, గాదే నాగయ్య,మెంతిన్ని తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తిమ్మాపూర్ సర్పంచ్

గజ్వేల్ నియోజకవర్గం, 26 జూన్ 2026 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతమ్‌ను శుక్రవారం జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం తిమ్మాపూర్ గ్రామంలోని పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యల గురించి సర్పంచ్ వివరించగా... చైర్మన్ నాగరిగారి ప్రీతం సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిగుల్ పరశురామ్, పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులు కృష్ణంరాజు, ప్రముఖ నాయకులు పైసా స్వామి, పోసాన్‌పల్లి రమేష్, పోసాన్‌పల్లి స్వామి, గుండ్రు స్వామి తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ జాబితా సవరణపై సబ్ కలెక్టర్ తనిఖీ



తల్లాడ జూన్ 26 విజన్ ఆంధ్ర : తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామం పోలింగ్ స్టేషన్ నెం. 4, 8 మరియు కొత్తవెంకటగిరి గ్రామం పోలింగ్ స్టేషన్ నెం. 15లను సందర్శించి, ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (రా×=--2026) కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (దీూాలు) నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఇంటింటి సర్వే మరియు ఎన్యూమ రేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ, ప్రజలకు అవగాహన కల్పించడం, అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా మరియు నిర్దేశిత మార్గదర్శకాల మేరకు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

# సమగ్ర అభివృద్ధే లక్ష్యం.. అర్హులందరికీ సంక్షేమం

కుత్బుల్లాపూర్, జూన్ 26 (విజన్ ఆంధ్ర) ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి వికాస్ రాజ్ (ఐఏఎస్) సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక సమగ్ర అభివృద్ధికి దోహదపడిందని ఆయన పేర్కొన్నారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కోటిరెడ్డితో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. వార్డు సభల నిర్వహణ ద్వారా గ్రామాలు, పట్టణాల స్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన పది కీలక అంశాల ఆధారంగా చేపట్టిన కార్యక్రమాలు జిల్లాలో సమర్థవంతంగా అమలయ్యాయని వెల్లడించారు.

**విద్యారంగంలో కీలక చర్యలు**

జిల్లాలో 510 ప్రభుత్వ పాఠశాలల్లో 85 వేలకుపైగా విద్యార్థులకు విద్యా సదుపాయాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. కొత్త ప్రాథమిక పాఠశాలలు, ప్రీ-ప్రైమరీ విభాగాలు ప్రారంభించడంతో పాటు ఉచిత ఇంటర్నెట్, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, చెప్పులు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాలు, రాగిజావ అందజేశారు. 'బడిబాట' కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించినట్లు వెల్లడించారు.

**వ్యవసాయానికి ఊతం**

25,932 మంది రైతులకు రూ.15.58 కోట్ల రైతు భరోసా అందించగా, రైతు బీమా కింద 37 కుటుంబాలకు రూ.1.85 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. నానో యూరియా, సహజ వ్యవసాయం, డిజిటల్ పంట సర్వే, కిసాన్ డ్రోన్లు, సౌర పంపుసెట్లపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు.

**ఆరోగ్య సేవల్లో విస్తృత కార్యక్రమాలు**

99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహ పరీక్షలు, క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాలు, దోమల నివారణ చర్యలు, గర్భిణీలకు ప్రత్యేక వైద్య సేవలు విస్తృతంగా నిర్వహించినట్లు ఆరోగ్య శాఖ అధికారులు వివరించారు. వడదెబ్బ నివారణపై వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణలు అందించినట్లు తెలిపారు.

**సంక్షేమ పథకాల అమలు**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా ప్రీ, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలతో పాటు విదేశీ విద్య కోసం 127 మంది విద్యార్థులకు రూ.25.41 కోట్ల ఆర్థిక సహాయం అందించారు. హాస్టళ్ల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, మౌలిక సదుపాయాల మెరుగుదలకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

**ఇందిరమ్మ ఇళ్లలో పురోగతి**

ఇందిరమ్మ గృహ పథకం కింద జిల్లాకు 2,249 ఇళ్లు మంజూరు కాగా, తొలి విడతలో 444 మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు నిర్వహించారు. అలాగే నిర్మాణంలో ఉన్న 37,056 డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**మున్సిపల్ శాఖకు అప్రమత్తత ఆదేశాలు**

వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ అధికారులకు వికాస్ రాజ్ ఆదేశించారు. డ్రైన్ శుభ్రత, ఫాగింగ్, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**మహిళా, శిశు సంక్షేమానికి ప్రాధాన్యం**

23 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించడంతో పాటు 11 మొబైల్ అంగన్‌వాడీలను ఏర్పాటు చేశారు. బాల్య వివాహాల నివారణ, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన, పోషకాహార కార్యక్రమాలు, బాలభరోసా, దత్తత సహాయ కేంద్రం వంటి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

**పర్యావరణ పరిరక్షణకు చర్యలు**

అటవీ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల నాటకం, ప్లాస్టిక్ నిర్మూలన, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

**సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి**

ప్రతి శాఖ తమ 99 రోజుల కార్యాచరణపై విజయగాథలు, ఉత్తమ విధానాలు, గణాంకాలు, ఛాయాచిత్రాలతో కూడిన సమగ్ర నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని జిల్లా ప్రత్యేక అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. మార్చి 6 నుంచి ప్రారంభమైన కార్యాచరణలో పాత ఫైళ్ల పరిష్కారం, కార్యాలయాల పరిశుభ్రత, ప్రజా సేవల మెరుగుదల వంటి అంశాల్లో విశేష ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.

## ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్తున్న కావేరి వ్యవసాయ పరిశోధనా కేంద్రం

**- ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్ఎస్. పరోడా**



గజ్వేల్ నియోజకవర్గం, 26 జూన్ 2026 (విజన్ ఆంధ్ర) : వ్యవసాయ రంగ అభివృద్ధిలో నూతన పరిశోధనలు మరింత అవసరం కానుండగా, ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్తున్న కావేరి యూనివర్సిటీ చక్కటి ఫలితాలు సాధించాలని ఐసిఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్ఎస్ పరోడా స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం శివారులోని కావేరి విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం చాన్సలర్ జి.వి. భాస్కర్ రావు తో కలిసి ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్, భారత ప్రభుత్వ వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ జనరల్ ఆర్ఎస్ పరోడా సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ సెంటర్, అత్యాధునిక ప్రయోగశాలలు, డ్రోన్ అకాడమీ, పరిశోధనా క్షేత్రాలు, పాలీహౌస్‌లు, పరిశోధన సదుపాయాలు పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న విద్యా, పరిశోధన, ఆవిష్కరణ కార్యక్రమాలను చూసి ఆయన ప్రశంసించారు. అధ్యాపకులు, పరిశోధకులతో ముచ్చటించి, వ్యవసాయ రంగంలో సాంకేతికత ఆధారిత పరిశోధనలు, నాణ్యమైన ఉన్నత విద్య, ఆవిష్కరణలకు కావేరి యూనివర్సిటీ చేస్తున్న కృషిని అభినందించారు. భవిష్యత్తులో జాతీయాభివృద్ధికి తోడ్పడే నాణ్యమైన పరిశోధనలు, విద్యా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రవీణ్ రావు పాల్గొన్నారు. కాగా డాక్టర్ ఆర్ఎస్ పరోడా అందించిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం విశ్వవిద్యాలయ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని యూనివర్సిటీ ఛాన్సలర్ జీవి భాస్కర్ రావు పేర్కొన్నారు.

## ప్రజల భద్రత కోసమే...
# కార్డెన్ సెర్చ్



**ముధోల్ సీఐ రవీందర్ నాయక్**

ముధోల్ :జూన్ 26:విజన్ ఆంధ్ర. :పోలీసులు ప్రజల భద్రత కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ముధోల్ సీఐ రవీందర్ నాయక్ అన్నారు. నిర్మల్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకుముధోల్ మండలంలోని ఎడ్ బిడ్ తాండ లో శుక్రవారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ద్వారా ప్రజలకి రక్షణ, భద్రత భావం కల్పించాలనే ఉద్దేశ్యమని అన్నారు. అదేవిధంగా గంజాయి మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరైనా వ్యక్తులు అనుమానంగా సంచరిస్తే సమాచారం అందించాన్నారు. సరియైన ధ్రువీకరణ పత్రాలు, సరైన నెంబర్ ప్లేట్లు లేని మోటార్ సైకిల్ 73, త్రి వీలర్ 1వాహనాలు సీజ్ చేశారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వాహనాలకు ఆర్సి, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైనచర్యలుతీసుకుంటామని అన్నారు. అదేవిధంగా మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ పెర్సిస్, అశోక్, తానూర్ ఎస్ ఐ జుబేర్, ఏ ఎస్ఐ యశ్వంత్, నర్సింగ్ భాను పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి



**- 20వ వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్**

గజ్వేల్, 26 జూన్ 2026 (విజన్ ఆంధ్ర) : ఆదివారం (28 జూన్ 2026) తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలోని ప్రజల సౌకర్యార్థం పోలియో చుక్కల పంపిణీ కోసం ప్రత్యేకంగా రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒకటి ప్రగతి స్కూల్ వద్ద, రెండవ కేంద్రం బస్టాండ్ స్టాండ్ ఆవరణలో నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ పిల్లలను పోలియో రహితంగా మార్చేందుకు సహకరించాలని, ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని కౌన్సిలర్ శ్రీనివాస్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 26 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినం సందర్భంగా స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ప్లేడ్జిప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సదానందం ఆధ్వర్యంలో అంబెద్కర్ చౌరస్తాలో డ్రగ్స్ కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు.డ్రగ్స్ రహిత తెలంగాణ సాధించడమే ఈ ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం అని కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు.డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏసిపి సదానందం మాట్లాడుతూ హుస్నాబాద్ డివిజన్లో డ్రగ్స్ వ్యతిరేకంగా అందరు సహకరించాలని మాదకద్రవ్యాలు అరికట్టడంలో అందరు సహకరించాలని, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం పిల్లలు యువతపై మాదగద్రవ్యాల వాడకుండా అరికట్టాలన్నారు. యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వర్లు,మాజీ జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి,మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వివి రమణ,వెన్నె రాజు కౌన్సిలర్లు పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, వైద్యం కిరణ్,పూదరి వరప్రసాద్ కేశవేణి రమేష్,బత్తుల స్వరూప, కేశవేణి రమేష్, కాంగ్రెస్ నాయకులు మార్క అనిల్, బూరుగు కిష్టస్వామి, బత్తుల రవీందర్, లావుడ్యా బిక్యా నాయక్, సంగ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు తమ ఓటు భద్రతను కాపాడుకోవాలి

**-18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి**

**- పట్టణ 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 26 : ఈనెల 25 నుండి ప్రారంభమైన ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ప్రక్రియ జులై 25 వరకు కొనసాగుతుందని వార్డు ప్రజలు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని అలాగే ప్రతి ఓటరు తమ ఓటు భద్రతను కాపాడుకోవాలని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో భాగంగా శుక్రవారం పట్టణంలోని 11వ వార్డులో ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ ఓటర్ నమోదులో భాగంగా ఓటు లేని,18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. బిఎల్ఎ,బిఎల్ఓ సిబ్బందికి సహకరించి తమ యొక్క ఓటు వివరాలు సరిచూసుకోవాలని అన్నారు. తప్పనిసరిగా మార్పులు, చేర్పులు ఉంటే చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్మన్ చిత్తారి పద్మా రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెల్లండి వెంకట రమణ, మండల అధ్యక్షులు వెన్నె రాజు, కౌన్సిలర్ లు పిల్లి తిరుపతి, రమేష్, బత్తుల స్వరూప , శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం డైరెక్టర్ గట్టు సాయి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు బూరుగు కృష్ణస్వామి, బత్తుల రవీందర్, గట్టు శ్రీనివాస్, జక్కుని సాగర్ , కాంసాని శంకర్,పూదరి సత్యం, బైరి రవి, పూదరి సత్యం, గట్టు యాదలక్ష్మి, పూదరి స్రవంతి, పూదరి రమ, బైరి రమ, తాళ్లపెల్లి అంజయ్య, బిఎల్ఓ తాళ్లపెల్లి సంతోషిని, బిఎల్ఎ పచ్చిమట్ల ప్రకాష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.వి.ఎం. వైద్య కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవ అవగాహన కార్యక్రమం

**- "డ్రగ్ రహిత సమాజ నిర్మాణంలో యువత, వైద్య విద్యార్థుల పాత్ర కీలకం"**

**- సిద్దిపేట అదనపు పోలీస్ కమిషనర్ కుశాల్కర్**



గజ్వేల్ నియోజకవర్గం, 26 జూన్ 2026 (విజన్ ఆంధ్ర) : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక మరియు మానవ అక్రమ రవాణా నిషేధ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్.వి.ఎం. వైద్య కళాశాలలోని బి.సి. రాయ్ గ్యాలరీలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సిద్దిపేట కమిషనరేట్ అదనపు పోలీస్ కమిషనర్ కుశాల్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు పోలీస్ కమిషనర్ కుశాల్కర్ మరియు అదనపు డీసీపీ (లా అండ్ ఆర్డర్) సుభాష్ చంద్ర బోస్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువత మాదక ద్రవ్యాలు సేవించి, మత్తులో అనేక రకాల ఘోరమైన నేరాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ అలవాటు వల్ల అమూల్యమైన ఆరోగ్యం పాడైపోవడమే కాకుండా, చివరకు వారు సమాజానికి చేడుపురుగులుగా మారుతున్నారని హెచ్చరించారు. ఈ మహమ్మారి బారిన పడకుండా యువత బయటకు వచ్చి, సమాజ శ్రేయస్సుకు మరియు దేశ ప్రగతికి సహకరించేలా తయారుకావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చడానికి అత్యంత ప్రతిష్టాత్మకంగా పూనుకుందని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. ప్రజలు, విద్యార్థులు మాదక ద్రవ్యాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, మీ దృష్టికి ఎలాంటి సమాచారం వచ్చినా వెంటనే '1908' హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందిన వెంటనే 'ఈగల్ స్క్వాడ్' రంగంలోకి దిగి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. వైద్య విద్యార్థులుగా సమాజంలో డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.వి.ఎం. మెడికల్ చైర్మన్ డాక్టర్ యాకయ్య, కాలేజ్ ప్రిన్సిపాల్ రాజేందర్, డీన్ డాక్టర్ శ్రవణ్ కుమార్, సీఈఓ శ్రీనివాసరావు, కాలేజీ డాక్టర్లు, ములుగు, మార్కుక్, గౌరారం, జగదేవపూర్, కుకునూర్ పల్లి పోలీస్ అధికారులు, వైద్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటరు హక్కును సద్వినియోగం చేసుకోవాలి: కౌన్సిలర్ స్రవంతి



బెల్లంపల్లి, జూన్ 26 విజన్ ఆంధ్ర ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని 31వ వార్డు, మహమ్మద్ ఖాసీం బస్తీ లో అవగాహన కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి స్రవంతి పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ,

అర్హులైన ప్రతి ఒక్కరూ కొత్త ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ కార్యక్రమంలో బీఎల్ఓ స్వరూప, వార్డు ఇంచార్జ్ బండారి ప్రవీణ్ కుమార్, బీఎల్ఏ ఎండీ అయాజ్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ మండలంలో ముందస్తు పారిశుధ్య పనులకు శ్రీకారం



తల్లాడ జూన్ 26 విజన్ ఆంధ్ర : రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని తల్లాడ మండలం బాలంపేట గ్రామపంచా యతీలో ముందస్తు పారిశుద్ధ్య పనులను శుక్రవారం వేగవంతం చేశారు డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను, తొలగించారు. గ్రామంలో నీటి నిల్వలు, పారిశుద్ధ్య పనులు తలెత్తకుండా నిరంతరం పర్యవేస్తున్నట్లు సర్పంచి కోసూరి ధనలక్ష్మి తెలిపారు. వర్షాకాలానికి ముందే ఈ పనులు చేపడుతున్న నేపథ్యంలో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి: చైర్మా పర్సన్ దావ స్వాతి..

బెల్లంపల్లి జూన్ 26 విజన్ ఆంధ్ర : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుభాష్‌నగర్ బస్తీ 7వ వార్డులో ఎస్ఐఆర్ సర్వేలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఫారాలు పంపిణీ చేస్తారని, ఓటర్లు వాటిని పూర్తిచేసి తిరిగి బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి సర్వేను విజయవంతం చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా బీఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఆర్ఐ రమేష్ , బీఎల్‌వోలు, స్థానిక నాయకులు దావరమేష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ మరియు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు లో పాల్గొన్న కేశంపేట సీఐ నరహరి

కేశంపేట విజన్ ఆంధ్ర27 కేశంపేట మండల పరిధిలోని నిడదవెల్లి గ్రామంలో శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేశంపేట సిఐ నరహరి పాల్గొన్నారు. సిఐ నరహరి మాట్లాడుతూ యువకులకు డ్రగ్స్ మహమ్మారి నిర్మూలన గురించి యువకులకు సైబర్ నేరాల అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల గురించి అలవాటు పడి జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ ఉప సర్పంచ్ సపుర అమేర్ వార్డు సభ్యులు రిజ్వానా బేగం మోహిన్ పోలీస్ స్పెషల్ అధికారి నాయకులు ముత్యాలు ఖాజా పాషా రాజేందర్ జంగయ్య శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నరు.

## జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవానికి భారీ హాజరు కావాలి: గౌండ్ల కృష్ణ గౌడ్

చేవెళ్ల, జూన్ 26 (విజన్ ఆంధ్ర) : జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవానికి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరుకావాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గౌండ్ల కృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన చేవెళ్ళలో 'విజన్ ఆంధ్ర'తో మాట్లాడుతూ... ఈ నెల 28న శంషాబాద్‌లో నూతన జిల్లా కార్యాలయాన్ని నితిన్ నబిన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బూత్ అధ్యక్షులు, బీఎల్ఏ-2లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించనున్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొని, అనంతరం నిర్వహించే సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్టీ బలోపేతానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని గౌండ్ల కృష్ణ గౌడ్ పేర్కొన్నారు.

# పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం

- జీడిమెట్ల జీహెచ్ఎం సుధాకర్‌కు ఆత్మీయ వీడ్కోలు
- పూర్వ విద్యార్థుల భావోద్వేగ నివాళులు
- క్రమశిక్షణ, నిబద్ధతకు ప్రతీకగా కొనియాడిన వక్తలు
- విద్యార్థుల జీవితాల్లో చెరగని ముద్ర వేసిన గురువు
- సహచర ఉపాధ్యాయులు, విద్యావేత్తల ప్రశంసలు
- ఆత్మీయ సమావేశం, విందుతో ముగిసిన కార్యక్రమం



పేట్ బషీరాబాద్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ విద్యా రంగంలో సుదీర్ఘకాలం విశిష్ట సేవలందించిన జీడిమెట్ల జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ ఎస్. సుధాకర్ పదవీ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో శుక్రవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, విలువల ఆధారిత విద్యాబోధనలో ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, సహచర ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సుధాకర్ విద్యా ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. ఆయన బోధన, పరిపాలనా దక్షత, విద్యార్థుల పట్ల చూపిన అంకితభావం అనేక మంది జీవితాలకు మార్గదర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతంలో సుధాకర్ విధులు నిర్వహించిన జెడ్పీహెచ్ఎస్ మూసాపేట్‌కు చెందిన 2010 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా హాజరై తమ గురువుకు ఘనంగా నివాళులర్పించారు. హైకోర్టు న్యాయవాది, విఐపీ మానవ హక్కుల సంఘం జాతీయ డైరెక్టర్ మహమ్మద్ జహంగీర్ (మున్నా), మల్లికార్జున్తో పాటు పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, తమ జీవితాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవడంలో సుధాకర్ అందించిన మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించిందని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎం ఆనంద్ జోషి, ఎస్ఏ (గణితం) ఆర్. గోపాలకృష్ణన్, ఎస్ఏ (సాంఘిక శాస్త్రం) ఆర్. గోపాల్, ఎస్ఏ (భౌతిక శాస్త్రం) అనిల్, ఎస్ఏ (ఇంగ్లీష్) కె. దస్తయ్యతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ, సుధాకర్ క్రమశిక్షణ, నిజాయితీ, విద్యార్థుల పట్ల అంకితభావం ప్రతి ఉపాధ్యాయుడికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయన పదవీ విరమణ విద్యాశాఖకు తీరని లోటని అభిప్రాయపడ్డారు. అనంతరం సుధాకర్‌ను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆపై ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం, విందు భోజనంతో కార్యక్రమం ముగిసింది. గురువు--విద్యార్థి అనుబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ సన్మాన వేడుక హాజరైన ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేసింది.

## ప్రతి వార్డులో మౌలిక వసతుల విస్తరణే లక్ష్యం: ఎమ్మెల్యే కాలే యాదయ్య

చేవెళ్ల, జూన్ 26 (విజన్ ఆంధ్ర): ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి వార్డులో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపాలిటీ 3వ వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కరికే మీనాక్షిసత్యనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... గ్రామాలు, పట్టణాల సమగ్ర ప్రగతికి నాణ్యమైన రహదారులు కీలకమని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే దిశగా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే



కాలే యాదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ మెంబర్, మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పిఏసిఎస్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# నివాస ప్రాంతంలో డంపింగ్ యార్డు తొలగించాలి

-నిజాంపేట్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

-మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన

-దుర్వాసన, దోమలతో స్థానికులు అనారోగ్య భయాందోళనలో జీవనం

-రోడ్లపై చెత్తతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం

-చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని సీపీఎం హెచ్చరిక

నిజాంపేట్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బండారి లేఔట్ డివిజన్‌లో, నిజాంపేట్--బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీల మధ్య ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యుడు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ, జనావాసాల మధ్య చెత్తను డంపింగ్ చేయడం వల్ల తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, ఈగలు అధికంగా పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు పక్కనే ఇటీవల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభమైందని, కళాశాలకు అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు చెత్త కుప్పలు, దుర్వాసనను చూసి వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొన్నదని ఆరోపించారు. విద్యా సంస్థకు ఆనుకుని చెత్త నిల్వ చేయడం వల్ల విద్యార్థినుల ఆరోగ్యం, విద్యా వాతావరణంపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అలాగే బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీల నుంచి మహిళా డిగ్రీ కళాశాల మీదుగా నిజాంపేట్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీల వరకు రహదారులపై చెత్త పేరుకుపోవడంతో ప్రజల రాకపోకలు ఇబ్బందికరంగా మారాయని తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డంపింగ్ యార్డును తక్షణమే అనువైన ప్రాంతానికి తరలించి, ప్రస్తుతం ఉన్న ప్రదేశాన్ని పూర్తిగా శుభ్రపరిచి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. డంపింగ్ యార్డును తరలించడంలో జాప్యం కొనసాగితే స్థానిక ప్రజలను సమీకరించి సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని రాథోడ్ సంతోష్ హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి. స్వామి, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ఉంది.. దాటేందుకు మార్గం లేదు !



### డ్రైనేజీపై వంతెన లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దౌల్తాబాద్, జూన్ 26(విజన్ ఆంధ్ర): దౌల్తాబాద్ మండల కేంద్రంలోని 8వ వార్డులో నిర్మించిన సీసీ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం బయటపడింది. రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసినప్పటికీ డ్రైనేజీ కాలువపై వంతెన నిర్మించకుండా వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వార్డులోని ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్డు నిర్మించిన, డ్రైనేజీ కాలువ దాటేందుకు అవసరమైన వంతెన నిర్మాణాన్ని విస్మరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో పాదచారులు, వృద్ధులు, చిన్నారులు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ధనం వెచ్చించి చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో ఉపయోగపడాలంటే డ్రైనేజీపై వెంటనే వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎస్సీ బస్తీలో ప్రజా సమస్యలపై మాజీ సర్పంచ్ కావలి గణేష్ పర్యటన

### -డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్లు, పారిశుధ్య సమస్యలపై స్థానికుల వినతి

### -అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ

దుండిగల్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): 296వ డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామ ఎస్సీ బస్తీలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను తెలుసుకునేందుకు దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. బస్తీలో ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, తాగునీటి కొరత, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం, వీధి దీపాల లేమి, పారిశుధ్య నిర్వహణలో లోపాలు, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం, దోమల బెడద, మురుగు కాలువల శుభ్రత వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు వివరించిన ప్రతి అంశాన్ని ఓర్పుగా విన్న మాజీ సర్పంచ్ కావలి గణేష్, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల



పరిష్కారానికి తన వంతు కృషి కొనసాగిస్తానని తెలిపారు. ఈ పర్యటనలో దత్తురిపల్లి నవీన్, సిరిగల్ల బాబు, యాప్రల్ బాలరాజ్, జోగు రంజిత్, జోగు బాలకృష్ణ, నిజాంపేట్ కిరణ్, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఎస్సీ బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## దేవులపల్లి గ్రామంలో ఘనంగా పీర్ల పండుగ పూజలు

కొడిపల్లి, జూన్ 26 (విజన్ ఆంధ్ర): మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని దేవులపల్లి గ్రామంలో
పీర్ల పండుగ పూజలు శుక్రవారం నాడు గ్రామ సర్పంచ్ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
గ్రామ సర్పంచ్ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని హిందూ, ముస్లిం సోదరులు సోదరభావంతో, ఐకమత్యంతో పాల్గొని పూజలను విజయవంతం చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించిన ఈ వేడుక గ్రామ ప్రజల ఐక్యతను, పరస్పర గౌరవాన్ని చాటిచెప్పిందనీ అందరూ కలిసి ఆనందోత్సాహాలతో పీర్ల పండుగను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని సర్పంచ్ తిరుపతి రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని పీర్ల పండుగను విజయవంతం చేశారు.

## సంతలో అధిక రేట్ల వసూళ్లు ప్రజలపై అదనపు భారం

బూర్గంపాడు మండలం ప్రతినిధి జూన్ 26( విజన్ ఆంధ్ర ) : బూర్గంపహాడ్ మండలం మోరంపల్లి బంజరు పశువుల సంత మరియు కూరగాయల సంతలో వ్యాపారులు మరియు ప్రజల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అధిక రేట్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంత నిర్వహణ బాధ్యులు నిర్ణయించిన రుసుముల కంటే ఎక్కువ మొత్తాలను వసూలు చేయడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
చిన్న వ్యాపారులు తమకు కేటాయించిన స్థలాలకు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని, రసీదులు ఇవ్వకుండా నగదు రూపంలో డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో రోజువారీ వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని వారు వాపోతున్నారు.
సంతకు వచ్చే ప్రజలు కూడా వస్తువుల ధరలు పెరగడానికి ఈ అదనపు వసూళ్లే కారణమని అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు సంతలో జరుగుతున్న వసూళ్లపై విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వ్యాపారులు మరియు



ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.
ప్రధాన ఆరోపణలు
నిర్ణయించిన రుసుముల కంటే అధిక వసూళ్లు.
రసీదులు ఇవ్వకుండా నగదు సేకరణ.
చిన్న వ్యాపారులపై ఆర్థిక భారం.
అధికారుల పర్యవేక్షణ లోపం.
ఈ వ్యవహారంపై అధికారులు స్పందించి, సంతలో వసూలు చేస్తున్న యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి.

## ఎమ్మెల్యే కుటుంబం కు ఎస్ఐఆర్.ఎన్యూమరేషన్ ఫామ్ ను అందజేత

గద్వాల జూన్ 26 విజన్ ఆంధ్ర) :జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని నల్లకుంట ఎమ్మెల్యే స్వగృహము నందు గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని బూత్ నంబర్ 233 లో ఎస్ఐఆర్. ప్రక్రియ భాగంలో ఎన్యూమరేషన్ ఫామ్ ను ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి, తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి కి బిఎల్ఓ,బిఎల్ఏ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తుమ్మల నరసింహులు యాదవ్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ సతీష్,బిఎల్ఏ రామాంజనేయులు,బిఎల్ఓ మహేష్, నాయకులు దౌలన్న, ఇమ్రాన్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వనమహోత్సవం లో భాగంగా దమ్మపేట డివైడర్ పై మొక్కలు నాటిన ఎమ్మెల్యే జారే

### - మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

### -ఎమ్మెల్యే జారె

దమ్మపేట విజన్ ఆంధ్ర (జూన్ 26):దమ్మపేట మండల కేంద్రంలో గల ప్రధాన రహదారి డివైడర్ పై తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించడం మరియు పర్యావరణాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా పర్యావరణ యజ్ఞాన్ని స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ మొక్కలు నాటి అధికారికంగా ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను



కాపాడుకోవడానికి మరియు భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని క్రమం తప్పకుండా సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు, ఈ కార్యక్రమంలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, దమ్మపేట ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, ఏ.ఎం.సి చైర్మన్ వాసం రాణి శ్రీను, సి.ఐ నాగరాజు, ఎస్.ఐ రాజేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కక్కిరాల రమేష్, కే.వి సత్యనారాయణ, చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాక రమేష్, దిశ కమిటీ సభ్యులు సొంగా ఏసుమణి, కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, రూపా రాంబాబు, చాట్ల శ్రీనివాసరావు, బద్దె వెంకటలీల రాంబాబు, పూనెం పోలమ్మ, షేక్ గోరె, పసుమర్తి కుసుమాంబ, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, గ్రామస్తులు అత్తులూరి వెంకట రామారావు, దాసరోజు రామబ్రహ్మం, పగడాల కృష్ణారావు, వనమాల శ్రీనివాసరావు వసంత, శంకవరం అయ్యప్ప, రొయ్యల కుమార్, కొయ్యల ప్రసాద్, చిలకా శ్రీను, ఉల్వల రాంబాబు, అన్నవరపు నాగేంద్రరావు, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

# డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**- డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి**

**- డ్రగ్స్ వినియోగంపై కఠిన చర్యలు తప్పవు: ఏసీపీ కిషన్**

చేవెళ్ల, జూన్ 26 (విజన్ ఆంధ్ర) : డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చేవెళ్లలోని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాల జనరల్ ఆస్పత్రిలో ఫ్యూచర్ సిటీ పోలీసులు, ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్య, నర్సింగ్, ఫిజియోథెరపీ విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వం మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు చేపడుతోందని తెలిపారు. ఏసీపీ కిషన్ మాట్లాడుతూ... డ్రగ్స్ వినియోగం నేరాలకు దారితీస్తుందని, మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి విద్యాసంస్థలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... డ్రగ్స్ నిర్మూలనలో వైద్యుల పాత్ర కీలకమని పేర్కొనగా, చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరరావు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సై తేజశ్రీ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జోయా రాణి, సీఈఓ అజ్మల్ హస్సన్, సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి, రఘువీరారెడ్డి, వినోద్ రెడ్డి, మల్లారెడ్డి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రానివ్వం!!



**- అధికారులు అలసత్వం వీడాలి.. మార్కెట్ సమస్యలు తీరాలి**

**- వ్యాపారస్తుల రక్షణ, వినియోగదారుల సౌకర్యమే మా బాధ్యత**

**- రామగుండం ప్రజల కోసం నిరంతరం క్షేత్రస్థాయిలోనే**

**- ముంపు ముప్పు లేకుండా మార్కెట్ పరిసరాల ఆధునికీకరణ**

**- రామగుండం మేయర్ మహంకాళి స్వామి**

పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 26 (విజన్ ఆంధ్ర) : రామగుండం నగర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందస్తు వ్యూహంతో ముందుకు సాగుతున్నాం అని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఈ మేరకు శుక్రవారం 39వ డివిజన్ కార్పొరేటర్ తిప్పారపు మానస ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెట్‌ను మేయర్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రానివ్వం, నగర ప్రజల కోసం నిరంతరం క్షేత్రస్థాయిలోనే ఉంటూ సేవలందిస్తాం అని అత్యంత నమ్మకంతో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో నెలకొన్న పలు సమస్యలను స్వయంగా గుర్తించిన మేయర్, వర్షాలు ప్రారంభమయ్యేలోపు ముంపు ముప్పు లేకుండా మార్కెట్ పరిసరాల ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంకల్పించారు. అక్కడ పేరుకుపోయిన సమస్యలపై మున్సిపల్ అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, అధికారులు ఇకనైనా అలసత్వం వీడాలని, మార్కెట్ సమస్యలు తక్షణమే తీరాలని అక్కడికక్కడే గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వర్షాకాలంలో కష్టమర్లకు, ఇక్కడి శ్రమజీవులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, వ్యాపారస్తుల రక్షణ, వినియోగదారుల సౌకర్యమే తమ ప్రథమ బాధ్యత అని ఆయన తేల్చి చెప్పారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, మౌలిక వసతుల కల్పనపై మున్సిపల్ అధికారులను తక్షణమే చర్యలు చేపట్టాలని స్పాట్ ఆర్డర్స్ ఇచ్చారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకే తామంతా రోడ్లపైకి వచ్చామని, నగర ప్రగతిలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, కార్పొరేటర్ గట్ల రమేష్, సింహాచలంతో పాటు స్థానిక వ్యాపారస్తులు, నగరపాలక సంస్థ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని, మేయర్ సంకల్పానికి పూర్తి మద్దతు ప్రకటించారు.

## పాత పాల్వంచలో ఓటర్ల ప్రక్రియ ఎస్ ఐ ఆర్‌లో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల శ్రీలత ప్రవీణ్ కుమార్.

పాల్వంచ ప్రతినిధి 26(విజన్ ఆంధ్ర) : ఓటర్ల నమోదు ఎన్యుమరేషన్ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా, పాత పాల్వంచ 46వ డివిజన్ పరిధిలోని 77, 78 పోలింగ్ బూత్‌లలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పాత పాల్వంచ ఇంచార్జి ముత్యాల శ్రీలత ప్రవీణ్ కుమార్ . పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు పార్టీ సమన్వయకర్త ఏనుగుల శ్రీను గారు, పార్టీ నియమించిన బూత్ స్థాయి ఏజెంట్లు ముత్యాల వంశీ, షేక్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, 47వ డివిజన్ పరిధిలోని 79వ పోలింగ్ బూత్‌లో జరిగిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో బీఆర్ఎస్ పార్టీ 47వ డివిజన్ ఇంచార్జ్ మిరియాల అలివేలు గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ అధికారిని, పార్టీ నియమించిన బిఎల్ఏ మిరియాల వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నాగసత్యం, యాదయ్య, డి.ఆర్.కె చాణిక్య, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## 28 నుండి సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు

పెబ్బేరు, జూన్ 26 ( విజన్ ఆంధ్ర ) : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)సిపిఎం వనపర్తి జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు జూన్ 28, 29, 30 తేదీలలో పెబ్బేరు పట్టణ కేంద్రంలో సాయిరాం ఫంక్షన్ హాల్ మూడు రోజులపాటు నిర్వహిస్తున్నాం ఈ రాజకీయ శిక్షణా తరగతులకు వనపర్తి జిల్లాలో ఉన్న ముఖ్య నాయకులు హాజరవుతారు ఈ రాజకీయ శిక్షణ తరగతులు బోధించేందుకు సిపిఎం రాష్ట్ర నాయకత్వం వచ్చే సిపిఎం కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు ఈ సందర్భంగా సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్లరాజు మాట్లాడుతూ రాజకీయ శిక్షణ తరగతులు పెబ్బేరు పట్టణంలో మొదటిసారి నిర్వహిస్తున్నామని ఈ రాజకీయ శిక్షణ తరగతుల్లో దేశ ఏరాజకీయ పరిస్థితులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి దేశంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ కంపెనీలకు భారతదేశ సంపదను అప్పజెప్పడం జరిగిందని కేంద్ర ప్రభుత్వం ఈ 12 సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యలను విస్మరించిందని మతోన్మాద విధానాలను అవలంబిస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలిందని రాష్ట్రంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం 6 గ్యారంటీల అమలులో భూష్టంగా ఉన్నాయని ఈ ప్రభుత్వ విధానాలపై భవిష్యత్తు పోరాటాలు రూపకల్పన చేయడం కోసం ఈ రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఈ రాజకీయ శిక్షణ తరగతులకు వనపర్తి జిల్లాలో ఉన్న సిపిఎం కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి మాజీ ఎంపీటీసీ జి బాలయ్య నాయకులు ఆర్ భాస్కర్ దేవన్న ఉషన్న మన్యం తదితరులు పాల్గొన్నారు

# పెట్టుబడిదారుల ఆధీనంలో పంట సాగు..!!

గూడూరు, జూన్ 26 (విజన్ ఆంధ్ర ) :ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన రైతులు దశాబ్దాలుగా అప్పుల బారిన పడి బతుకుబండిని నడుపుతున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పెట్టుబడి సామగ్రిని వినియోగించాలన్న తాపత్రయంలో, వారు ప్రభుత్వ సహాయం అందక ప్రైవేట్ పెట్టుబడిదారుల వైపు మొగ్గు చూపుతున్నారు. కానీ దీని ఫలితం ఏమిటంటే రైతు ఒక అంతులేని అప్పు చక్రంలో చిక్కుకుపోతున్నాడు.ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, ఒక జీవన విధానాన్నే ముప్పుకు గురి చేస్తుంది.ఏజెన్సీ ప్రాంతాలలో చాలామంది రైతులకు పత్రపూరితంగా భూములు ఉన్నా, వారి దగ్గర సాగు ప్రారంభించేందుకు అవసరమైన ప్రారంభ పెట్టుబడి (విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, శ్రమదారుల జీతాలు) ఉండదు. ప్రభుత్వ స్థాయిలో రుణాలు పొందడం లేదా సబ్సిడీలు సకాలంలో అందకపోవడంతో, వారు ప్రైవేట్ వ్యక్తుల దగ్గరే అప్పులు తీసుకోవాల్సి వస్తోంది.ఈ రుణాలు సాధారణంగా లిఖిత రూపంలో కాకుండా మౌఖిక ఒప్పందాలే ఉంటాయి. వడ్డీ రేట్లు చాలా అధికంగా ఉంటాయి.ఈ తీవ్రత రైతును అప్పు పంట అప్పు అనే దోబూచులాటలో నెట్టేస్తోంది.

పంట విక్రయం లాభం ఎవరికో.?

రైతు శ్రమించి పంట పండించిన తర్వాత, స్వేచ్ఛగా తన పంటను మార్కెట్లో అమ్ముకునే హక్కును కూడా కోల్పోతాడు. ఎందుకంటే పెట్టుబడిదారు ముందుగానే ఒప్పందాన్ని బలంగా పెట్టి, తాను చెప్పిన తక్కువ ధరకే ఆ పంటను కొనుగోలు చేస్తాడు. మార్కెట్ ధర ఎంత ఉన్నా రైతుకు అది లాభంగా ఉండదు.ఫలితంగా రైతు చేతికి వచ్చే మొత్తం, అప్పు చెల్లించగలిగేంత కూడా ఉండదు.ఇక పెట్టుబడిదారునికి మాత్రం డబుల్ లాభం ఒకటి అధిక వడ్డీ రూపంలో, రెండవది తక్కువ ధరకు పంట కొనుగోలు చేసి మార్కెట్‌లో అధిక ధరకు విక్రయించడం.దీనికి తోడు ప్రకృతి విపత్తుల నష్టం వ్యవసాయం అనేది ప్రకృతిపై ఆధారపడి ఉండటంతో, వర్షాభావం, వరదలు, నష్టపరిచే తెగుళ్లు వంటి విపత్తుల వల్ల పంట నష్టపోతే రైతు సంపూర్ణంగా నష్టపోతాడు. అయినప్పటికీ అప్పు మాత్రం వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సిందే.ఈ నేపథ్యంలో, కొంతమంది రైతులు అదే అప్పుతో మళ్ళీ ఆ సంవత్సరం పంట సాగు చేస్తారు అదే పెట్టుబడి దారుడికి తిరిగి పంట పోస్తారు.ఇదే చక్రం తిరుగుతుంది. కొన్ని సందర్భాల్లో రైతులు అప్పు తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలు కూడా చేసుకున్న సంఘటనలు ఉన్నాయి.

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి.?

నిపుణుల అభిప్రాయమేమంటే రైతు సహకార సంఘాలు ఇవి పటిష్టంగా ఏర్పాటు చేసి, రైతుల ఉత్పత్తిని నేరుగా మార్కెట్లో అమ్మే అవకాశం కల్పించాలి. ఇది మధ్యవర్తుల ఆధిపత్యాన్ని తగ్గిస్తుంది.సబ్సిడీ, తక్కువ వడ్డీ రుణాలు, ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రైతులకు తక్కువ వడ్డీ రుణాలు వేగంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలి.విత్తనాలు, ఎరువులు వంటి వస్తువులపై ప్రభుత్వం నేరుగా సాయం చేయాలి. ఇది రైతు మీద పెట్టుబడి భారాన్ని తగ్గిస్తుంది.విపత్తు సమయంలో భరోసా ఇచ్చే వ్యవస్థలు రైతుభరోసా, పంట భీమా వంటి పథకాలు పూర్తిస్థాయిలో అమలవ్వాలి.ఈ సమస్యను ఇప్పుడే గమనించి పటిష్ట చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో గిరిజన రైతులు వ్యవసాయం పట్ల ఆసక్తి కోల్పోతారు. ఇది కేవలం వ్యక్తిగత స్థాయి సమస్య కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఆహార భద్రత మొత్తం మీద దీని ప్రభావం చూపుతుంది.అందువల్ల, ప్రభుత్వంతో పాటు స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం అందరూ కలిసికట్టుగా పనిచేయాలి.వ్యవసాయాన్ని రైతు చేతిలోనే ఉంచే విధంగా, కాకుండా ప్రైవేట్ పెట్టుబడిదారుల ఆధీనంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి.రైతు బాగుపడితేనే గ్రామీణ భారత్ బాగుపడుతుంది.వ్యవసాయాన్ని ఆదుకోవడం మానవిక బాధ్యతగా భావించాలి.

# తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనాని విజయవంతం చేయండి

**- డాక్టర్ పిడమర్తి రవి**



జూన్ 28 ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ ఎన్సిసి గేట్ దగ్గర BSF ఓయూ అధ్యక్షులు కల్వకుర్తి శ్రీశైలం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళన గోడపత్రికను విడుదల చేసిన అనంతరం పిడమర్తి రవి గారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు భాగంగా 250 గజాల ఇంటి స్థలం ఉద్యమకారులకు గుర్తింపు కార్డు అదే విధంగా పింఛన్ ఇవ్వాలని ప్రధాన డిమాండ్తో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులు వేల సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దీఖీ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నాయకులు రింగు రాంబాబు, దీఖీ ఓయూ ఉపాధ్యక్షులు ఆరెకంటి శ్రీకాంత్, మీసాల మహేష్,కళాకారులు పిడమర్తి రాంబాబు, భూక్య హరినాయక్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సర్వేలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలి

**- మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల**



నిజామాబాద్ జూన్ 26: (విజన్ ఆంధ్ర )ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా సంబంధిత అధికారులు మరియు బీఎల్ఓల నుంచి ఎన్యూమరేషన్ పత్రాలను స్వీకరించడం జరిగిందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తమకు అందిన ఎన్యూమరేషన్ పత్రాన్ని పూర్తిగా, సరైన వివరాలతో నింపి, అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి, నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్ఓ లేదా ఎన్నికల అధికారులకు అందజేయాలని కోరారు. ఓటు హక్కు ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని, చిన్న నిర్లక్ష్యం వల్ల భవిష్యత్తులో ఓటు నమోదు, సవరణ లేదా ఇతర సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ప్రతి కుటుంబం ఈ ప్రక్రియను సీరియస్‌గా తీసుకుని, ఇంట్లోని ప్రతి అర్హత కలిగిన ఓటరికి సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయించాలని సూచించారు.

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ప్రజలందరూ ఎన్నికల సంఘానికి సహకరిస్తూ ఈ సర్వేను విజయవంతం చేయాలని, అలాగే తమ బంధువులు, స్నేహితులు, పొరుగువారిలో కూడా అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించేలా సహకరించాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల విజ్ఞప్తి చేశారు.

"మన ఓటు -- మన హక్కు... మన బాధ్యత. ప్రతి ఓటరిని రక్షించుకుందాం అని తెలిపారు.

## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం



రాజోలి , జూన్ 26 (విజన్ ఆంధ్ర) రాజోలి మండల కేంద్రం లోని తుమ్మలపల్లె గ్రామంలో ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందిన పవన్ కుమార్ కుటుంబానికి శుక్రవారం కోట్లతిమ్మారెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. తన మిత్రుని మరణ వార్త తను ఎంతగానో బాదేసిందని తన కుటుంబంతోఉన్నఅనుబంధంతోకర్నూలులో నివాసముం టున్న కోట్ల తిమ్మారెడ్డి తన మిత్రుల ద్వారా సేకరించిన మొత్తం 18 వేల రూపాయలు తన మిత్రుడు పవన్ కుమార్ కుటుంబీకులకుఅందజేయడం జరిగింది. భవిష్యత్తులో పవన్ కుటుంబానికి మరింత సహకారం అందిస్తామని ఈ సందర్భంగా తిమ్మారెడ్డి అన్నారు.



## అర్బన్ ఎమ్మెల్యేకు ఎన్నిమొరేషన్ పత్రాలు అందజేత

నిజామాబాద్ జూన్26: ( విజన్ ఆంధ్ర ) సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మొదటి రోజు ఎన్యుమరేషన్ పత్రాలను సంబంధిత బిఎల్ఓ సునీత అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణకు, కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో పాల్గొనాలని తెలిపారు. సంబంధిత బిఎల్వోలు ప్రతి ఇంటికి చేరుకొని పత్రాలను అందజేస్తారని, వాటిని పూరించి తిరిగి అధికారులకు అందజేయాలని చెప్పారు. 20 ఏళ్ల క్రితం సర్ జరిగిందని, మళ్లీ జరుగుతున్న ప్రక్రియలో ప్రతి ఒక్కరు పాల్గొని ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ప్రతి ఇంటికి బిఎల్వోలు వచ్చే విధంగా కార్పొరేటర్లు చూడాలన్నారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎన్యుమరేషన్ పత్రాలు అందరికీ అందేలా చూడాలన్నారు.

## మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా మిట్టమిది నాగరాజు నియామకం



మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుల నియామకాలను శుక్రవారం ప్రకటించారు. ఈ జాబితాలో మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మిట్టమిది నాగరాజు నియమితులయ్యారు. మిట్టమిది నాగరాజు నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ఎస్సీ మోర్చాను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు ఆయన అంకితభావంతో పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగరాజుకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# ఎస్టీపీఎస్‌లో విద్యుత్ భద్రతా వారోత్సవాల ప్రారంభం !!

**- భద్రత ఆచారం కాదు... మన బాధ్యత**

**- చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది**

**- నిర్లక్ష్యం వద్దు.. అప్రమత్తతే రక్ష**

**- ఈడీ చందన్ కుమార్ సమంత**

పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 26 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు శుక్రవారం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభమయ్యాయి. "నేటి అవగాహన - రేపటి నివారణ" అనే వినూత్న నినాదంతో, కార్యాలయంలో విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా అరికట్టడమే ధ్యేయంగా రూపొందించిన ఈ సుదీర్ఘ వారోత్సవాల ప్రారంభ వేడుకలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) చందన్ కుమార్ సమంత ముఖ్య అతిథిగా విచ్చేసి వారోత్సవాలను అధికారికంగా ప్రారంభించగా, ఉన్నతాధికారులు ముకుల్ రాయ్, అభిజిత్ దత్తా, బినోయ్ జోష్ పాల్గొని సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. పారిశ్రామిక రంగానికి పట్టుకొమ్మలైన ఉద్యోగులు, ఒప్పంద కార్మికులలో విద్యుత్ భద్రత పట్ల చైతన్యాన్ని రగిలించి, వారిలో క్రియాశీలక రక్షణ సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యంగా సాగిన సామూహిక భద్రతా ప్రసంగం కార్మికుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది. ఈ సందర్భంగా ఈడీ చందన్ కుమార్ సమంత మాట్లాడుతూ, "ఈ వారోత్సవాలు కేవలం ఒక ఆచారం కాదు, మనందరి ప్రాణ రక్షణకు సంబంధించిన పవిత్ర బాధ్యత అని, విద్యుత్ రంగంలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరూ నిరంతర నిఘా, ముందస్తు అప్రమత్తత కలిగి ఉండాలని" పిలుపునిచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, సంబంధిత ప్రమాదాలను పూర్తిగా సున్నా స్థాయికి తీసుకురావడమే మన తక్షణ లక్ష్యమని, సురక్షితమైన పని పద్ధతులను పాటించడం మన హక్కు, బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం, పని ప్రదేశాలలో ప్రతికూల పరిస్థితులను అధిగమించి, సురక్షితమైన పని పద్ధతులను తు.చ. తప్పకుండా పాటిస్తామని, విద్యుత్ ముప్పుల నివారణకు అంకితభావంతో పనిచేస్తామని ఈ సందర్భంగా ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు అందరూ కలిసి సామూహికంగా భద్రతా ప్రతిజ్ఞ చేశారు. జూలై 2 వరకు వారం రోజుల పాటు సాగనున్న ఈ విభిన్న అవగాహన కార్యక్రమాలలో ఉద్యోగులందరూ తమ బృందాలతో కలిసి చురుగ్గా పాల్గొని, తెలంగాణ ఎస్టీపీఎస్‌ను ప్రమాద రహిత ప్లాంట్‌గా తీర్చిదిద్దాలని యాజమాన్యం విజ్ఞప్తి చేయడంతో ప్లాంట్ ప్రాంగణం ప్రస్తుతం భద్రతా స్ఫూర్తితో ముస్తాబైంది.

## విద్యార్థుల శ్రేయస్సే మా ధ్యేయం - శ్రీధర్

అనంతపురం జూన్ 26 ( విజన్ ఆంధ్ర ): విద్యార్థుల భవిష్యత్తు వారి శ్రేయస్సు కోసం విలువలతో కూడిన విద్యను బోధించడమే మా లక్ష్యమని కూడేరు లో ఉన్న శ్రీ వాణి స్కూల్ ఆఫ్ లెర్నింగ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో అనుభవంతో కూడిన ఉపాధ్యాయుల చేత విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని తెలిపారు. అదేవిదంగా నర్సరీ నుంచి తొమ్మిదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నామని ఫీజులు కూడ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అతి తక్కువ ఫీజులను మాత్రమే తీసుకుంటున్నామని పేద పిల్లలకు ఉచితంగా విద్యను అందిస్తున్నామని శ్రీధర్ స్పష్టం చేశారు.

## నేడు వనపర్తి బీజేపీ నూతన జిల్లా కార్యాలయం ప్రారంభం



వనపర్తి బ్యూరో జూన్ 26 (విజన్ ఆంధ్ర ): వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరంలో నూతనంగా నిర్మించిన భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జాతీయ అధ్యక్షులు పర్వావల్ ద్వారా ప్రారంభించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు డి. నారాయణ తెలిపారు.

పార్టీ రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తా.

### - గ్రామ సర్పంచ్ గున్నెల శ్రీను

వెల్దండ: జూన్ 26 (విజన్ ఆంధ్ర). మండలంలోని రాచూరు గ్రామం లో 8, 9 వార్డుల్లో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ గున్నెల శ్రీను శుక్రవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. గ్రామపంచాయతీ నిధుల నుంచి రూ. 5 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గున్నెల శ్రీను మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాస్కే గణేష్, వార్డు సభ్యులు సురేష్ రెడ్డి, రామార్జున్, చంద్రశేఖర్,గ్రామస్తులు బాలకృష్ణయ్య గౌడ్, పడకంటి వెంకటేష్, జంగయ్య, కృష్ణయ్య, శేఖర్ గౌడ్, పర్వతాలు, రమేష్, శ్రీశైలం, శ్రీను, రాజశేఖర్, ప్రహ్లాద్, బండ శ్రీశైలం, ఐలెన్, తదితరులు పాల్గొన్నారు.

## బఫర్ జోన్ల కబ్జా...

### వాగుల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు

### స్థానిక లీడర్ల జోక్యంతో పట్టించుకోని మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్లు

అయిజ జూన్ 26 విజన్ ఆంధ్ర) శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అయిజ మున్సిపాలిటీలో భూముల ధరలు పెరగడంతో వాగు ఒడ్డున భూములలో అక్రమ నిర్మాణాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలకు అధికారుల అండ ఉండడంతో అధికారులు తాము గీసిందే గీత తాము రాసిందే రాత అనే విధంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.పట్టణ కేంద్రంలో అక్రమ నిర్మాణల కట్టడాలు జోరందుకున్నాయి. అంబేద్కర్ సర్కిల్ ఎదురుగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణం పై జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ ఎమ్మార్వో, పురపాలక కమిషనర్ చర్యలు శూన్యం అవుతున్నాయి.ఒకవైపు ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ అవినీతి అక్రమాలను అంతం చేసే విధంగా 'ప్రజా పాలన దిశగా అడుగులు వేయాలని జిల్లా స్థాయి అధికారులు ఆదేశాలతో సమీక్ష సమావేశాలు జరిపి చర్యలు తీసుకోవాలని కోరిన పట్టణ, మండల అధికారులు మాత్రం ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## డయాబెటిస్ బాధితుల్లో పీఏడీపై అవగాహన పెరగాలి

### డా. శ్రీకాంత్ రాజు




మహబూబ్‌నగర్ అర్బన్ జూన్ 26 (విజన్ ఆంధ్ర): డయాబెటిస్ రోగుల్లో కాళ్లకు రక్తప్రసరణ తగ్గే సమస్య అయిన పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ (పీఏడీ)పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, నిర్లక్ష్యం చేస్తే కాలు కోల్పోయే ప్రమాదం ఉందని యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ యూనిట్) సీనియర్ కన్సల్టెంట్ వాస్క్యులర్ ఽ ఎండోవాస్క్యులర్ సర్జన్, క్లినికల్ డైరెక్టర్ డా. ఎస్. శ్రీకాంత్ రాజు తెలిపారు.మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డయాబెటిక్ రోగుల్లో పీఏడీ వేగంగా పెరుగుతోందన్నారు. రక్తప్రసరణ సరిగా లేకపోవడంతో చిన్న గాయాలు కూడా మానకుండా పుండ్లుగా మారే ప్రమాదం ఉందని, నరాల సమస్యల కారణంగా కొందరికి నొప్పి కూడా తెలియకపోవచ్చని హెచ్చరించారు.

నడిచేటప్పుడు కాళ్లలో నొప్పి రావడం, త్వరగా అలసిపోవడం, పాదాలు చల్లగా ఉండటం, మానని గాయాలు ఏర్పడటం, వేళ్లు నల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. డాప్లర్ స్కాన్ వంటి పరీక్షల ద్వారా సమస్యను ముందుగానే గుర్తించి చికిత్స అందించవచ్చని తెలిపారు. డయాబెటిస్ రోగులు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచుకోవాలని, ధూమపానం పూర్తిగా మానేయాలని సూచించారు. అవసరమైతే మందులు, యాంజియోప్లాస్టీ వంటి ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతిరోజూ పాదాలను పరిశీలించడం, చిన్న గాయాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవడం ద్వారా కాలు కోల్పోయే ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చని డా. శ్రీకాంత్ రాజు స్పష్టం చేశారు.

## షట్టర్ల కేటాయింపులో తీవ్ర అవకతవకలు..

### రెండో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



కల్వకుర్తి జూన్ 26 (విజన్ ఆంధ్ర): కల్వకుర్తిలో షట్టర్ల కేటాయింపులో తీవ్ర స్థాయిలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి.

కేటాయింపుల ప్రక్రియలో పారదర్శకత పాటించలేదని, లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు అవకాశం కల్పించారని ఆందోళనకారులు ఆరోపించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఉద్దేశపూర్వకంగానే బహిర్గతం చేయడం లేదని, స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిళ్ల మేరకు అధికారులు జాబితాను గోప్యంగా ఉంచుతున్నారని వారు విమర్శించారు. వెంటనే ఎంపికైన లబ్ధిదారుల పూర్తి వివరాలను ప్రకటించి, నిజమైన అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ న్యాయం జరిగే వరకు తమ రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఈ రిలే నిరాహార దీక్షల్లో ఇంజమూరి శ్రీనివాసులు, దున్న రమేష్, నేరటి మల్లేష్, రాజు, బాలరాజు, నారాయణమూర్తి, పి. శ్రీకాంత్, కమలశెట్టి నరేష్, కమలశెట్టి నాగరాజు, జి. వెంకటయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పల్స్ పోలియో లాజిస్టిక్స్ పంపిణీ



గద్వాల జూన్ 26 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుండి శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రత్యేక వాహనాల ద్వారా పల్స్ పోలియో కార్యక్రమ మెటీరియల్, లాజిస్టిక్స్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది డివిఎల్ ఎం. నరేంద్రబాబు, ఏఎన్ఓ. తిరుమలేష్ రెడ్డి,డిఎంహెచ్ఓ. హీర్యానాయక్,ఎన్ సిడి-డిపిసి. శ్యామ్ సుందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా టీకాల అధికారి డాక్టర్ మొహమ్మద్ అజ్గర్ అలీ (డిఐఓ) మాట్లాడుతూ

ఈనెల 28-05-2026 ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో రౌండ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని. ఈరోజు పిహెచ్ సి. కి చేరిన మెటీరియల్‌ను 27-06-2026 శనివారం ఉదయం లోగా అన్ని సబ్ సెంటర్లకు, ఆశా కార్యకర్తలకు చేర్చాలి. కోల్డ్ చైన్ మెయింటెన్ చేస్తూ వివిఎం స్టేజ్ -1, 2 లో ఉన్న వైల్స్ మాత్రమే వాడాలి. ఒక్క బిడ్డ కూడా మిస్ కాకుండా 100% సాధించాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి పిహెచ్ సి. మెడికల్ ఆఫీసర్ తమ పరిధిలోని కోల్డ్ చైన్ పాయింట్లు, బూత్ లొకేషన్లు, టీమ్ రూట్ మ్యాప్‌ను మరోసారి చెక్ చేసుకొని, 27-06-2026 లోగా మైక్రో ప్లాన్ ఫైనల్ చేయాలని సూచించారు.

## నార్సింగి రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గండిపేట, జూన్ 26(విజన్ ఆంధ్ర): లంగర్‌హౌజ్ నుండి నార్సింగి వైపు వెళ్లే ప్రధాన రహదారిపై గల టాటా మోటార్స్ షోరూమ్ ఎదురుగా, ఫుట్‌పాత్‌పై ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శుక్రవారం డయల్-100 ద్వారా అందిన సమాచారంతో నార్సింగి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫుట్‌పాత్‌పై సుమారు 32 నుండి 35 సంవత్సరాల వయస్సు గల ఒక పురుషుడి మృతదేహం దిగంబరంగా పడి ఉండటాన్ని పోలీసులు గమనించారు. స్థానికులను విచారించగా, సదరు వ్యక్తి గత రెండు, మూడు రోజులుగా అదే పరిసర ప్రాంతాల్లో మానసిక స్థితి సరిగ్గా లేనట్లుగా తిరుగుతున్నాడని తెలిసింది. మృతదేహాన్ని నిశితంగా పరిశీలించిన పోలీసులు, ఆ వ్యక్తి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు సేకరించేందుకు, అతడు ఎవరు? ఎక్కడి నుండి వచ్చాడు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని గుర్తింపు తెలిసిన వారు నార్సింగి పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరారు. అత్యవసర సమాచారం కోసం: ఎవరికైనా ఈ వ్యక్తికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే నార్సింగి పోలీస్ స్టేషన్ అధికారులను ఆశీ సంపత్ ASI ph 9440018848 లేదా డయల్-100 ద్వారా సంప్రదించగలరు.

# బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ ను సన్మానించిన ఎస్సై కిరణ్



అయిజ జూన్ 26 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎం శ్రీనివాస్ సాధారణ బదిలీల్లో భాగంగా గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం అయిజ ఎస్సై కిరణ్ ఆధ్వర్యంలో పోలీసు సిబంది ఎం శ్రీనివాస్ కు శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై కిరణ్ మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ ఎం శ్రీనివాస్ విధులు సక్రమంగా నిర్వహించారని, బదిలీలు సాధారణమని అన్నారు. కానిస్టేబుల్ ప్రస్తుతం అయిజ పోలీస్ స్టేషన్ నుండి గద్వాల్ రూరల్ పీఎస్ కు బదిలీపై వెళ్తున్నారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జయ్యన్న, కానిస్టేబుల్ లు రవి,వైకుంఠం, హర్ష,రమణ,రావినాయక్, రామాంజినేయులు, ఆకాష్, ప్రసాద్,నర్సిములు, రవి, పుష్ప, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ !!!

**నేటి యువతకు ఆదర్శం !!!**

**- అడ్వకేట్ జగన్ మోహన్**

**- బిఎస్పీ (BSP)నిర్మల్ జిల్లా అధ్యక్షులు**



నిర్మల్ :జూన్ 26:విజన్ ఆంధ్ర.

ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలు నిర్మల్ జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం నందు నిర్వహించారు,ఛత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా జన్మదిన ఘన నివాళులు అర్పించారు, కార్యక్రమాన్ని ఉద్దేశించి నిర్మల్ జిల్లా అధ్యక్షులు జగన్ మోహన్ మాట్లాడుతూ....కొల్హాపూర్ సంస్థానంలో బహుజనులకు రిజర్వేషన్స్ ఇచ్చి సంస్థానాన్ని సామాజిక సంస్థానంగా మార్చి ఆదర్శంగా నిలిచారని.

గౌతమ బుద్ధుడు, కబీర్ దాస్, మహాత్మ జ్యోతిబాపూలే, ఆశయాలను ఆలోచనలను ఆచరణాత్మకంగా చూపిన ఛత్రపతి సాహుజీ మహారాజ్ అని కొని ఆడారు, కొల్హాపూర్ సంస్థానంలో 50 శాతం రిజర్వేషన్లు అమలుపరిచి, శాసనము చేసి మొట్టమొదటిసారిగా బహు జనులకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన మహనీయుడు ఛత్రపతి సాహుజీ మహారాజ్ అని అన్నారు, బాబాసాహెబ్ అంబేద్కర్ గారి విద్యకు, సహకారం అందించడమే కాక ముక్ నాయక్ పత్రికకు అండగా నిలిచారనీ, 1920 సంవత్సరములోనే దక్కన్ అస్పృశ్య సమాజ సమ్మేళన సభలో భవిష్యత్తు అంతా కూడా అంబేద్కర్ ఆశయాలతోనే ముందుకు సాగుతుందని ముందే తెలిపారని,కోల్హాపూర్ సంస్థానంలో ఉద్యోగాలు ఇస్తూ భూములకు పట్టాలిచ్చారన్నారు,అంటరానితనం నిర్మూలనకు పాటుపడిన మానవతావాది అని,వితంతు వివాహ చట్టం తెచ్చి,కుల నిర్మూలన కోరకై కులాంతర వివాహాలు ప్రోత్సహించారని కొనియాడారు.నేటి యువత ఛత్రపతి సాహుజీమహారాజ్ ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో -అడ్వకేట్ జగన్ మోహన్ జిల్లా అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి చింతకుంట రాజేశ్వర్,ఉ పాధ్యక్షులు లక్ష్మీ యాదవ్,జిల్లా కార్యదర్శి చెరుకు రాజ్యం,కోశాధికారి వడిగెల రాజేష్,జిల్లా సభ్యులు కాటం ప్రభాకర్,ఖానాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ జోసఫ్ గంగారాం,ముధోల్ నియోజకవర్గం ఇంచార్జ్ పవార్ లక్ష్మణ్,ఖానాపూర్ అధ్యక్షులు అంకంపేట గంగాధర్,నిర్మల్ నియోజకవర్గం అధ్యక్షులు క్యాతం సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలి: కంది శ్రీనివాస రెడ్డి

ఆదిలాబాద్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా సాగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యంగా బీఎల్ఏల పాత్ర ఇందులో చాలా కీలకమని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కేఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు , కౌన్సిలర్ కంటెస్టెడ్ అభ్యర్థులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మన ఓట్లు కాపాడుకోవడం మన బాధ్యత అని అన్నారు. ఇందుకు బూత్ సూపర్ వైజర్లు, పార్టీ మండల అధ్యక్షులతో పాటు బీఎల్ఏ-2 లతో పాటు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరక్షరాస్యులు, పేదలు, గ్రామీణ ప్రజలకు సర్ పై అవగాహన కల్పిస్తూ ఓటు కోల్పోకుండా చూడాలన్నారు. అలాగే ప్రతీ రోజు ఎన్ని ఎన్యుమరేషన్ ఫారాలు నింపించి బీఎల్ఓలకు అందించారో ఆ సంఖ్య వివరాలను ఏ రోజుకారోజు 7436859999 అనే నంబర్ కు పంపాలన్నారు. డెయిలీ అప్ డేట్ కోసం 8 మందితో ఓ బృందాన్ని నియమించినట్టు తెలిపారు. ఈవివరాలన్ని ప్రతీ రోజు గాంధీ భవన్ కు పంపుతామన్నారు. తమ వార్డుల వారీగా మ్యాపింగ్ కాని వివరాలు తెలుసుకుని మ్యాపింగ్ అయ్యేలా చేయాలన్నారు. దీనిపై అధిష్టానం నుండి కీలక ఆదేశాలున్నాయని ఎవరు కూడీ నిర్లక్ష్యం బహించవద్దన్నారు. అర్హుల ఓట్లు ఒక్కటి కూడా పోకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ , సర్ కోర్డినేటర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి , మాజీ ఎంపీ సోయం బాపూరావు ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించారు. ఇప్పటివరకు ఇంకా జిల్లాలో ఓట్లు మ్యాపింగ్ కానివి ఉ న్నాయని వాటి విషయంలో దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ , కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఖిజర్ పాషా, బండారి సతీష్, అడ్డి భోజారెడ్డి, రఫీఖ్, అనిల్, గుడిపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



# సాలూరలో మొహర్రం పీర్ల ఊరేగింపు ఘనంగా...

## సామరస్యానికి ప్రతీకగా ముగిసిన వేడుక



సాలూర, జూన్ 27 ( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలో మొహర్రం పండుగ సందర్భంగా శనివారం పీర్ల ఊరేగింపు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ వేడుకలో ముస్లింలతో పాటు హిందూ సోదరులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని మత సామరస్యాన్ని చాటారు.

ఇస్లాం చరిత్రలో కర్బలా యుద్ధంలో అమరులైన హజ్రత్ ఇమామ్ హసన్ మరియు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ త్యాగాలను స్మరించుకుంటూ మొహర్రం పండుగను నిర్వహిస్తారు. ధర్మం, న్యాయం, సత్యం కోసం వారు చేసిన త్యాగానికి గుర్తుగా ఈ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీ

సాలూరలో ఐదు రోజుల పాటు పీర్ల బంగ్లాల్లో ప్రత్యేక ప్రార్థనలు, మొక్కులు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తమ కోరికలు నెరవేరాలని ప్రార్థిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు భక్తులకు షర్బత్ పంపిణీ చేయడం కూడా ఆనవాయితీగా కొనసాగుతోంది.

ఆరవ రోజు నిర్వహించిన పీర్ల ఊరేగింపు నాలో హైదర్ బంగ్లా నుంచి ప్రారంభమై సాలూర ప్రధాన వీధుల గుండా భక్తి వాతావరణంలో సాగింది. అనంతరం మౌలాలి బంగ్లా వద్దకు చేరుకున్న పీర్లను సంప్రదాయం ప్రకారం "అన్నదమ్ముల కలయిక"గా భావిస్తూ పరస్పరం అలై-బలై చేసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ఘట్టంతో మొహర్రం వేడుకలు ముగిశాయి.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ సభ్యురాలు లావణ్య రవి. గ్రామ పెద్దలు,మత పెద్దలు, యువకులు,మహిళలు,వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు సాలూరలో మొహర్రం పండుగ మరోసారి మత సామరస్యానికి,సోదరభావానికి ప్రతీకగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు

# ఘనంగా ఛత్రపతి సాహుజీ మహారాజ్ జయంతి వేడుకలు



గద్వాల జూన్ 26 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఛత్రపతి సాహుజీ మహారాజ్ (రాజర్షి సాహూ మహారాజ్) 152వ జయంతి ని గద్వాల పట్టణంలోని టీజేఏస్ ఆఫీసు నందు అఖిలపక్ష నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఛత్రపతి సాహుజీ మహారాజ్ కొల్హాపూర్ సంస్థానానికి చెందిన ప్రసిద్ధ పాలకుడు, గొప్ప సామాజిక సంస్కర్త, విద్యా ప్రోత్సాహకుడు అని కొనియాడారు.

ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ

1902లో భారతదేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో వెనుకబడిన వర్గాల (బ్రాహ్మణేతర వర్గాల) కోసం 50% రిజర్వేషన్లు అమలు చేశారు. ఇది సామాజిక సమానత్వ దిశగా చారిత్రాత్మకమైన విప్లవాత్మక నిర్ణయం అని అన్నారు.

1917లో అన్ని కులాలు, మతాలకు చెందిన పిల్లల కోసం ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు చేశారు.బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ప్రత్యేక పాఠశాలలు, వసతి గృహాలు, విద్యా వేతనాలు ఏర్పాటు చేశారు.రాజారాం కళాశాల వంటి అనేక పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లను స్థాపించారు.

వెనుకబడిన వర్గాలు, దళితులు, మహిళలకు విద్యా అవకాశాలను విస్తరించారు. రాజర్షి ఛత్రపతి సాహుజీ మహారాజ్ ఆలోచనలు, సంస్కరణలు నేటికీ మహారాష్ట్రతో పాటు యావత్ భారతదేశంలో సామాజిక న్యాయం, విద్యా సమానత్వం, సమగ్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచాయి. ఆదర్శ సాధన కోసం భాహుజన రాజ్య దిశగా ఐక్యం కావాలని ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడడం జరిగింది.

## జూన్ 28నుండి పల్స్ పోలియో కార్యక్రమం...

బోధన్, జూన్ 26(విజన్ ఆంధ్ర) : బోధన్ డివిజన్ పరిధిలో జూన్ 28, 29, 30 తేదీలలో పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉప వైద్య,ఆరోగ్య అధికారి, డా.విద్యా రణ్వాల్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 0--5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం ప్రధాన లక్ష్యమని, ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. జూన్ 28 (మొదటి రోజు) ఆదివారం డివిజన్‌లో ఏర్పాటు చేసిన 84 పల్స్ పోలియో బూత్‌లలో 0--5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయబడతాయని పేర్కొన్నారు. జూన్ 29, 30 తేదీలలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి, బూత్‌లకు రాని, పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి ఇంటి వద్దే పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎన్.జి.ఓ.ఆరోగ్య సిబ్బంది, ఇతర పారామెడికల్ సిబ్బంది పాల్గొంటారని చెప్పారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజాన్ని కొనసాగించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జూన్ 28న పిల్లలను సమీపంలోని పల్స్ పోలియో బూత్‌కు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని, అలాగే జూన్ 29, 30 తేదీలలో ఇంటింటికి వచ్చే ఆరోగ్య బృందాలకు పూర్తి సహకారం అందించాలని తల్లి తండ్రులను ఆమె కోరారు.

## తొర్రూరు మార్కెట్ ను కుదేలు చేస్తున్న మార్వాడీలు.

**- జనరల్,స్వీట్స్,కంగన హాల్స్ ,స్టీల్ ,ఎలక్ట్రికల్ ,గోల్డ్ షాప్ యజమానులు**

**- జీరో దందా అంబర్ ఆర్ ఆర్ గుట్కాలు**

**- ప్లాస్టిక్ కవర్ల దందాలు**

**- కట్టడి చేయ లేక పోతున్న అధికారులు**

తొర్రూరు జూన్ 26(విజన్ ఆంధ్ర) : తొర్రూర్ మార్కెట్ వ్యాపార రంగంలో మార్వాడీలు దొరవడి మార్కెట్ ను కుదేలు చేస్తూ వ్యాపారస్తులను దెబ్బతీస్తున్న మార్వాడీలు. ఎలక్ట్రికల్ స్టీల్ జనరల్ సిగరెట్లు మరియు గుట్కాలు గోల్డ్ షాప్ బట్టల షాప్ ప్లైవుడ్ షాపులు కంగన్ హాల్స్ ప్రతి ఒక్కటి మార్కెట్లో జీరో ధనదాతో ప్రజలకు బిల్లులు లేని వ్యాపారాలు చేస్తూ రోజువారు లక్షల రూపాయలు బేరం చేసిన ఒక్కరికి బిల్లు ఇవ్వరు. ప్రభుత్వానికి జీఎస్టీ రూపేణా,లక్షలరూపాయల చెల్లించకుండా ప్రభుత్వానికి పంగనామాలు పెడుతున్న మార్వాడీ దుకాణాల పై జీఎస్టీ మున్సిపల్ పోలీస్ అధికారులు రోజువారి చెకింగ్లు చేసి జీరో దందాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. మార్వాడి షాపులలోనే ప్లాస్టిక్ కవర్లు ప్రభుత్వ నిషేధిత కవర్లు ప్లాస్టిక్ ఐటమ్స్ వారి షాపులలోనే ఎక్కువగా ప్రజలకు లభిస్తాయి. కావునైట్టి వ్యాపారాలపై సరిగానిగా పెట్టాలని ప్లాస్టిక్ రహిత తొరూర్ మున్సిపాలిటీగా గుట్కా అంబర్ దొరకని మున్సిపాలిటీగా తయారు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కామ్రేడ్ డీవీకే కు ఘన నివాళులు...

బోధన్, జూన్26 (విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద గల పార్టీ జెండా గద్దె వద్ద కామ్రేడ్ డీవీకే 4వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ కామ్రేడ్ డివికే భారత దేశ విప్లవోద్యమ నాయకుడని, కమ్యూనిస్టు సిద్ధాంతకర్త అని అన్నారు. ఆయన చెప్పింది ఆచరించిన వాడని అతివాదానికి మితవాదానికి వ్యతిరేకంగా పోరాడి ప్రజాపంథా మార్గం సరి అయిందని బోధించాడని నిజామాబాద్ జిల్లాలో బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్మికుల్ని ఐక్యత చేసి సంఘటిత పరిచి అనేక పోరాటాలు చేయించి అనేక విజయాలను సాధించిన దానిలో ఆయన కృషి ఎనలేనిదని కొనియాడారు. కామ్రేడ్ డివికే ఏ ఆశయాల కోసం అయితే పనిచేశారో వాటిని నెరవేర్చుటకై పోరాటాలు చేయడమే ఆయనకు నిజమైన నివాళులని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పడాల శంకర్, ఇర్షద్, సాయిలు, పోశెట్టి, దేవయ్య, లాలయ్య, గంగారాం, సాయిబాబా, శ్రీను, లక్ష్మణ్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కారు బైక్ ఢీ కొని ఒకరు మృతి

కొత్తకోట జూన్ 26 (విజన్ ఆంధ్ర) : కొత్తకోట: కారు బైకు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రంలోని చోటుచేసుకుంది. ఎస్సై శివానందం గౌడ్ వివరాల ప్రకారం మండల పరిధిలోని కానయపల్లి గ్రామానికి చెందిన ఇప్పనూరి వెంకట్ కుమార్ (45) కారు బైక్ ఢీకొనడం తో మృతి చెందాడు. గురువారం రాత్రి కనయపల్లి గ్రామం నుండి కొత్తకోటకు మొహరం పండుగ పీర్లను దర్శించేందుకు తన ఇద్దరు కుమారులు తన స్నేహితుడితో కలిసి బైక్ పై కొత్తకోటకు వస్తుండగా మార్గమధ్యంలో బిపిఆర్ గార్డెన్ సమీపంలోకి రాగానే ఆత్మకూర్ నుండి వనపర్తికి వెళుతు కారు అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ముందు వస్తున్న బైకును బలంగా ఢీకొనడంతో బైక్‌పై ఉన్న వెంకట్ కుమార్ తీవ్రంగా గాయపడి ఉండడంతో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలోని మృతి చెందాడు. కాగా ఇద్దరు చిన్నారులకు రాజు కు కాళ్లు విరిగాయి గాయపడిన వీరిని మహబూబ్ నగర్ ఎస్వీఎస్



ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వెంకట్ కుమార్ మృతి చెందడం పట్ల గ్రామంలో విషాద ఛాయలు అములు కున్నాయి కాగా పలువురిని కంట తడి పెట్టాయి.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై జోనల్ కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీ

**-జీడిమెట్ల సర్కిల్‌లో బి ఎల్ ఓ ల పనితీరును పరిశీలించిన పింకేష్ కుమార్, ఐఏఎస్**

**-ఇంటింటి సర్వే, ఓటరు వివరాల ధృవీకరణను వేగవంతం చేయాలని ఆదేశం**

**-అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచన**

**-పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సవరణ ప్రక్రియ నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం**



కుత్బుల్లాపూర్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): 045--కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జీడిమెట్ల సర్కిల్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని శుక్రవారం జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఐఏఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు), బి ఎల్ ఓ సూపర్వైజర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల ధృవీకరణ, సవరణ ప్రక్రియ పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణను పూర్తి పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల వివరాల సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేను వేగవంతం చేసి, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలపై అధికారులతో నేరుగా చర్చించి, ఎదురవుతున్న సమస్యలు, పురోగతిని తెలుసుకున్న జోనల్ కమిషనర్, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, బి ఎల్ ఓ సూపర్వైజర్ జవహర్‌లాల్‌తో పాటు సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# పేద రోగికి సీఎం సహాయనిధితో రూ.2.75 లక్షల వైద్య సాయం

**-కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చొరవతో మంజూరు**

**-నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడికి ఊరట**

**-కుటుంబ సభ్యులకు సహాయనిధి పత్రాల అందజేత**

**-పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని హన్మంత్ రెడ్డి వ్యాఖ్య**

**-ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి సీఎం సహాయనిధి గొప్ప వరమని వెల్లడి**

కుత్బుల్లాపూర్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): పేద ప్రజలకు నాణ్యమైన వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి ప్రాంతానికి చెందిన బొల్లం సంజీవరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స, శస్త్రచికిత్సకు అవసరమైన వ్యయాన్ని భరించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు కొలన్ హన్మంత్ రెడ్డిని ఆశ్రయించారు. వెంటనే స్పందించిన హన్మంత్ రెడ్డి, తెలంగాణ శాసన మండలిలో ప్రభుత్వ ప్రధాన విప్‌గా ఉన్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రెండు లక్షల డెబ్బై ఐదు వేల రూపాయల వైద్య



సహాయం మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. మంజూరైన సహాయనిధి పత్రాలను బాధితుడి కుటుంబ సభ్యులకు కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సకు దూరమవుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. అవసరమైన ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. సహాయనిధి మంజూరుకు సహకరించిన ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఎన్యూమరేషన్స్ ఫారాల పంపిణీ పక్రియ నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలి

జన్నారం, జూన్ 26 (విజన్ ఆంధ్ర) : ఎన్యూమరేష న్ ఫారాల పంపిణీ పక్రియను నిర్ణిత గడువులోగా ఫారదర్శకంగా పూర్తి చేయాలని ఉట్నూర్ ఆర్డీఓ మోహన్ సింగ్, కార్యాలయ పరిపాలన అధికారి సబ్బ రమేష్ లు బిఎల్ఓ లకు సూచించారు. భార త ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబి తా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవా రం రోజున జన్నారం మండలంలోని మురిమడు గు, మొర్రిగూడ, ఇంధనపల్లి, టిజి పల్లె గ్రామాలలో బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి కి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను వా రు పరిశీలించి ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయా లని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందే లా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో త హసీల్దార్ బక్కయ్య, మండల గిర్దావర్ వెంకటేశం, బూత్ లెవల్ అధికారులు, ఇతర రెవెన్యూ సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా లబ్ధికి కొత్త పట్టాదారులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి

### - మండల వ్యవసాయాధికారి హరికృష్ణ



విజన్ ఆంధ్ర -- సిర్గాపూర్, జూన్ 26 : సిర్గాపూర్ మండలంలోని రైతులకు రైతు భరోసా ఖరీఫ్ 2026--27 వర్షాకానికి సంబంధించినా 15 జూన్ 2026 వరకు కొత్తగా పట్టా పొందిన రైతులు రైతు భరోసా పథకంలో నమోదు కోసం తమ పరిధిలోని గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ తెలిపారు. దరఖాస్తుతో పాటు రైతులు రైతు భరోసా దరఖాస్తు ఫారం, పట్టా పాస్‌బుక్ జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జూలై 5, 2026 లోపు దరఖాస్తు సమర్పించాలని మండల వ్యవసాయ అధికారి జి. హరికృష్ణ తెలిపారు.

# - భూ పోరాట క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణఖేడ్,జూన్ 26 (విజన్ ఆంధ్ర):జూలై 2న హైదరాబాద్లో ఉప్పల్ బాగ్లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల భూ పోరాట బహిరంగ సభకు నారాయణఖేడ్ నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ రాష్ట్ర సేన టిఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా కోఆర్డినేటర్ లు భవాని శివశంకర్ నారాయణఖేడ్ నియోజకవర్గ తెలంగాణ రాష్ట్ర సేన టిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి బాపు మల్ శెట్టి లు పిలుపునిచ్చారు శుక్రవారం నాడు నారాయణఖేడ్ పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుల భూ పోరాట క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఇన్చార్జి బాపు మల్ శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే అధికారంలో వచ్చిన అనంతరం ఉద్యమకారులకు 25 వేల పెన్షన్ 250 గజాల ఇంటి స్థలం ఐడి కార్డు బస్సు పాస్ ఫ్రీ ఇప్పిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా మోసం చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ విషయాన్ని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు టిఆర్ఎస్ పార్టీ కవితమ్మ నాయకత్వంలో జూలై 2న హైదరాబాద్లో జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల భూపోరాట బహిరంగ సభ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ బహిరంగ సభకు నియోజకవర్గము నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగేంత వరకు అందరు కలిసికట్టుగా పోరాటం చేయాలని మీ భవిష్యత్తు కోసమే భూ పోరాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కవితమ్మ పిలుపునిచ్చిందని వారు పేర్కొన్నారు ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారుడు ముందుకు వచ్చి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని వరకు పోరాటం చేయవలసిందిగా వారు పిలుపునిచ్చారు గత ప్రభుత్వం మోసం చేస్తే ఈ ఇప్పటి ప్రభుత్వం కూడా అదే దారిలో కొనసాగుతుందని విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించి మన భవిష్యత్తు కోసం కలిసికట్టుగా రావాల్సిందిగా వారు పేర్కొన్నారు తప్పకుండా తెలంగాణ రాష్ట్ర సేన టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కవితమ్మ నాయకత్వంలో మన సమస్య పరిష్కారం అవుతుందని నమ్మకం ఉందని అందుకోసం మీరందరూ సంఘటితమై ఉద్యమానికి సిద్ధం కావలసిందిగా మరోసారి వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు సంజీవరెడ్డి కవితమ్మ నారాయణఖేడ్ జేఏసీ నాయకులు కిష్టయ్య శంకర్ యాదవ్ మాస్టర్ మాణిక్య ముదిరాజ్ నరేందర్ రాజగిరి శ్రీనివాస్ భీమ్సేన ప్రశాంత్ బూలి భాయ్ ఆరిఫ్ కిషన్ నాయక్ నాగిరెడ్డి కృష్ణ రామన్న తదితరులు పాల్గొన్నారు

## ఎలక్ట్రిక్ మీడియా డివిజన్ అధ్యక్షుడిగా 10టీవీ కు చెందిన పంపన రమేష్



బూర్గంపాడు మండల ప్రతినిధి జూన్ 26 విజన్ ఆంధ్ర

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : పినపాక నియోజకవర్గం స్థాయిలో ఎలక్ట్రిక్ మీడియా డివిజన్ అధ్యక్షుడిగా 10టీవీ కు చెందిన పంపన రమేష్ ఏకగ్రీవంగా జర్నలిస్టు అందరూ కలిసి ఎన్నుకోవడం జరిగింది

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మా ప్లస్ క్లబ్ అధ్యక్షుడు పంపన రమేష్ 10టీవీ కు చెందిన

తినపాక నియోజకవర్గం స్థాయిలో ఎలక్ట్రి మీడియా డివిజన్ అధ్యక్షులుగా 10టీవీ కు చెందిన పంపండి రమేష్ ఏకగ్రీవంగా జర్నలిస్ట్ తొందరగా కలిసి ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం ప్రింట్ అండ్ ఎలక్ట్రి మీడియా రిపోర్టర్లు ఆధ్వర్యంలో ఆహ్లాదకరంగా జరిగింది

ఈ కార్యక్రమంలో ుఖఔజీ ×జీఖ రాష్ట్ర నాయకులు జాతీయ కౌన్సిలింగ్ సభ్యులు బివి రమణారెడ్డి జిల్లా అధ్యక్షులు రత్నం జిల్లా కార్యదర్శి రమేష్ మరియు పినపాక నియోజకవర్గం చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రిక్ రిపోర్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు పంపన రమేష్ నాయకత్వంలో నియోజకవర్గ టి మీడియా మరింత బలోవేతం అవుతుందని జర్నలిస్టులు అభినందన తెలిపారు

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన మొహమ్మద్ జాకీర్

**-131వ డివిజన్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పరిశీలన**

**-బీఎల్ఓలు, బీఎల్ఏలతో కలిసి ఇంటింటికీ ధృవీకరణ ప్రక్రియకు సమీక్ష**

**-అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు కావాలని సూచనలు**

**-ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదేనని పిలుపు**

కుత్బుల్లాపూర్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): 131వ డివిజన్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ--2026 కార్యక్రమాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర న్యాయ విభాగం కన్వీనర్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మొహమ్మద్ జాకీర్ శుక్రవారం సంబంధిత బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల ధృవీకరణ ప్రక్రియను పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటరు వివరాల్లో పొరపాట్లు లేకుండా పారదర్శకంగా సవరణ ప్రక్రియ నిర్వహించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవడంతో పాటు వివరాలను సరిచూసుకోవాలని మొహమ్మద్ జాకీర్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదేనని పేర్కొంటూ, ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





## వర్షానికి కూలిన ఇల్లు

బోథ్ జూన్ 26 (విజన్ ఆంధ్ర) బోథ్ మండలంలోని దన్నూర్ (బి) గ్రామంలో శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి తోర్తి రాజు వ్యక్తి ఇల్లు కూలిపోయింది. నివాసం ఉంటున్న ఇల్లు కూలడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్ట పరిహారం అందించాలని, నూతనంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలనీ బాధితులు కోరుతున్నారు.

# గుండాల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్ష పదవి ఎవరికి..?

- ఆశావహుల్లో ఉత్కంఠ
- అధిష్టానం నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి




గుండాల, జూన్ 26 (విజన్ ఆంధ్ర) : గుండాల మండల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష పదవి ఎవరికి దక్కనుందనే అంశం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, రాబోయే ఎన్నికలకు పార్టీని సిద్ధం చేయడం లక్ష్యంగా కొత్త అధ్యక్షుడి ఎంపికపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించింది.

గ్రామ శాఖ అధ్యక్ష పదవికి పలువురు సీనియర్ నాయకులు కొడపర్తి భాస్కర్ జిట్ట అంజయ్య ఆవుల శ్రీనివాసులు మేకల నాగమల్లు,యువ నాయకులు పోటీలో ఉన్నట్లు సమాచారం. పార్టీ కోసం నిరంతరం పనిచేసిన నాయకులు, ప్రజల్లో గుర్తింపు పొందిన కార్యకర్తలు, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన వారిని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఇప్పటికే మండల, జిల్లా స్థాయి నాయకులు గ్రామ నాయకులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ ఐక్యతకు భంగం కలగకుండా అందరి అభిప్రాయాలను తీసుకుని ఏకాభిప్రాయంతో అధ్యక్షుడిని ఎంపిక చేయాలని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం.

అధ్యక్ష పదవి కోసం ఆశావహులు తమకు అవకాశం కల్పించాలని పార్టీ పెద్దలను కలుస్తుండగా, కార్యకర్తలు మాత్రం సమర్థ నాయకుడిని ఎంపిక చేయాలని కోరుతున్నారు. అధికారిక ప్రకటన కోసం గ్రామ కాంగ్రెస్ శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి."గుండాల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్ష పదవి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. అధిష్టానం నిర్ణయం కోసం నాయకులు, కార్యకర్తలు ఎదురుచూస్తుండగా, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది".

## పాఠ్యపుస్తకాలఅమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**బోధన్ విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్.**

బోధన్, జూన్26 (విజన్ ఆంధ్ర) : బోధన్ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని పిఆర్టియు భవన్ లో శుక్రవారం పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు నవాతే ప్రతాప్ మాట్లాడుతూ బోధన్ పట్టణంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా పాఠ్యపుస్తకాలు బుక్ డిపో కి సంబంధించిన స్టేషనరీ యూనిఫామ్ అమ్మడం సిగ్గుచేటన్నారు. విద్యాశాఖ అధికారులు స్కూల్స్ లలో కానీ స్కూల్ యొక్క ప్రాంతంలో గాని బుక్స్ గాని స్టేషనరీ అమ్మద్దు అని చెప్పినప్పటికీ వారి మాటలను పట్టించుకోకుండా యదేచ్ఛగా విద్యార్థుల తల్లిదండ్రుల నుండి బలవంతంగా బుక్స్ పేరుతో అడ్మిషన్ల పేరుతో ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలన్నారు. బోధన్ లో కొన్ని పాఠశాలలలో సరైన సౌకర్యాలు లేకున్నా ఎంఈఓ కనీసం అటువైపు చూడకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాల పేరుతో నోట్ బుక్స్, అడ్మిషన్ పేరుతో సౌకర్యాలు లేకుండా పాఠశాలలను నడిపిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి ఆందోళన కార్యక్రమాలకు వెనకడుగు వేయబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ డి.నాగరాజు, నాయకులు యన్.బాల్ రాజ్, మావురం శ్రీకాంత్, ప్రశాంత్, కిరణ్, రాజన్న, శ్రీను తదితరులు ఉన్నారు.




## ఎండోమెంట్ సెల్‌కు మరింత గుర్తింపు తీసుకురావాలి

- రత్నం, శ్రీవర్ధన్ రెడ్డి
- ధార్మిక విభాగం జాయింట్ కన్వీనర్ వెంకట్ రాంరెడ్డికి సన్మానం



చేవెళ్ల, జూన్ 26 (విజన్ ఆంధ్ర) : బీజేపీ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా నియమితులైన కేశపల్లి వెంకట్ రాంరెడ్డి ధార్మిక రంగంలో పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ఎండోమెంట్ సెల్‌కు మరింత గుర్తింపు తీసుకురావాలి అని మాజీ ఎమ్మెల్యే కే.ఎస్. రత్నం, భువనగిరి ఇంచార్జ్ శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. వెంకట్ రాంరెడ్డి ఇటీవల రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా నియమితులైన సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్‌లో ఆయనను శాలువాతో సత్కరించి, పూలగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పార్టీ నాయకత్వం ఆయనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ధార్మిక రంగంలో విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థకు మరింత గుర్తింపు తీసుకురావాలని సూచించారు. అనంతరం వెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ... తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయాల పరిరక్షణ, ధార్మిక విలువల పరిరక్షణతో పాటు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ప్రభాకర్ రెడ్డి, శ్రీశైలం, బీజేపీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, కార్యదర్శి కృష్ణ గౌడ్, ఓబీసీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శర్వలింగం, బీఎస్ఎన్ఎల్ మెంబర్ సామ మాణిక్య రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్ రెడ్డి, నాయకులు అత్తెల్లి అనంత్ రెడ్డి, మున్నూరు శ్రీకాంత్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- బాచుపల్లి కౌసల్య కాలనీలో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ
- డ్వాక్రా మహిళల్లో ఆనందం నింపిన ఇందిరమ్మ చీరల పంపిణీ
- ముఖ్య అతిథిగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి కౌసల్య కాలనీలో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల సంక్షేమం, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ చీరల పంపిణీతో డ్వాక్రా మహిళల్లో ఆనందం నెలకొందని, ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, వారి ఆర్థిక, సామాజిక సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ద్వారక గ్రామ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, యశోద, ఆర్‌పీ కరుణ, ఆర్‌పీ జ్యోతి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తిరుపతి రెడ్డి, కాలనీ మహిళలు, స్థానిక నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.